# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం
హన్మకొండ, వరంగల్, జనగాం, మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

గురువారం | 10సెప్టెంబరు, 2026 | పేజీలు :08


## కాళోజీ జీవితం ఆదర్శణీయం



## హామీల అమలుకు ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉంది

* స్పీకర్‌పై వ్యాఖ్యలకు కెసిఆర్, కెటిఆర్, హరీష్ రావు క్షమాపణలు చెప్పాలి
* అసెంబ్లీ సమావేశాల్లో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలకు కట్టుబడి, ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతున్నారని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు (జీఎస్సార్) అన్నారు. ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ప్రజల అవసరాలకు అనుగుణంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తూ, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై బిఆర్ఎస్ నాయకులు ఇష్టానుసారంగా, ఏక వచనంతో మాట్లాడటం ఏమాత్రం సమంజసం కాదని ఆయన హెచ్చరించారు. శాసనసభలో బుధవారం ఎమ్మెల్యే జీఎస్సార్ రాష్ట్రంలోని ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, గత బీఆర్ఎస్ పాలనలో ఇచ్చిన హామీలు, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు, కేంద్రం లోని బిజెపి విధానాలపై తన అభిప్రాయాలను వెల్లడించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ముందుకు సాగుతున్నారని ఎమ్మెల్యే జిఎస్సార్ అన్నారు. పేదలు, రైతులు, మహిళలు, యువ త, విద్యార్థులు, ఉద్యోగులు, బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు తీసుకెళ్తున్న ముఖ్యమంత్రిపై బిఆర్ఎస్ నాయకులు మాట్లాడడం వారికి తగదని తెలిపారు.

### రేవంత్ రెడ్డి గారిపై వ్యక్తిగత విమర్శలు తగవు

రాజకీయాల్లో ప్రభుత్వ విధానాలపై విమర్శలు చేయడం స హజమేనని, అయితే ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తిపై వ్య క్తిగత విమర్శలు చేయడం రాజకీయ సంస్కృతికి మంచిది కాదని ఎమ్మెల్యే అన్నారు. ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించాలని వారి కి సూచించారు. ప్రతిపక్షంగా నిర్మాణాత్మకమైన సూచనలు చే యాలని, ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని అన్నారు. కానీ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి ఓర్వలే క ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై నిరాధారమైన ఆరోపణలు చేయ డం, ఇష్టారీతిన మాట్లాడటం మానుకోవాలని హెచ్చరించారు.

### బిఆర్ఎస్ హామీలపై ప్రజలకు సమాధానం చెప్పాలి

బిఆర్ఎస్ పార్టీ గతంలో అధికారంలో ఉన్న సమయంలో ప్రజల కు ఇచ్చిన అనేక హామీలను అమలు చేయలేదని ఎమ్మెల్యే జీఎస్సార్ విమర్శించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తామని హామీ ఇచ్చి ఆ హామీని నిలబెట్టుకోలేద ని, దళిత బంధు విషయంలోనూ అర్హులైన ప్రతి కుటుంబానికి మోసం చేశారని అన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఇచ్చిన హా మీలను అమలు చేయని వారు, ఇప్పుడు ప్రజా సంక్షేమం కోసం పనిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే ముందు తమ పాలనపై ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు.

### స్పీకర్‌పై వ్యాఖ్యలకు కెసిఆర్, కెటిఆర్, హరీష్ రావు క్షమాపణలు చెప్పాలి

శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్‌పై బిఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలపై ఎమ్మెల్యే జీఎస్సార్ మరోసారి తీవ్రంగా స్పందించారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న స్పీకర్‌ను కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు. ఈ వ్యవహారంపై బిఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర రావు, కల్వకుంట్ల తారక రామారావు, తన్నీరు హరీశ్ రావులు తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

## ప్రజాకవి కాళోజీ ఆలోచనలను అనుసరించాలి

కలెక్టర్ స్నేహ శబరిష్



**ప్రజాపక్షం/మహబూబాబాద్:** ప్రజాకవి కాళోజీ నారాయణరావు ఆలోచనలను ప్రతి ఒక్కరూ అనుసరించాలని మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న తెలంగాణ భాషా దినోత్సవం సందర్భంగా ప్రజాకవి కాళోజీ నారాయణరావు 112వ జయంతి వేడుకలను బుధవారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కాళోజీ చిత్రపటానికి పూలమాలలు సమర్పించి, ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రజాకవి కాళోజీ తెలంగాణ ఆత్మను, ప్రజల జీవనాన్ని, సామాజిక స్పృహను తన కవిత్వంలో ప్రతిబింబించిన మహోన్నత వ్యక్తి అని అన్నారు. తెలుగు మాత్రమే కాకుండా ఉర్దూ, హిందీ, మరాఠీ, ఆంగ్లం, తదితర భాషల్లో కూడా కవితలు రచించిన బహుభాషా కోవిదుడిగా కాళోజీ నిలిచారని తెలిపారు.సామాజిక న్యాయం కోసం నిరంతరం పోరాటం చేసిన ప్రజా కవిగా కాళోజీ చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని పేర్కొన్నారు. ప్రజల సమస్యలపై స్పందిస్తూ ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు కాళోజీ చేసిన కృషి అందరికీ ఆదర్శమని అన్నారు.కాళోజీ సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం 1992లో పద్మ విభూషణ్ పురస్కారాన్ని ప్రదానం చేసిందని గుర్తు చేశారు. ఒకసారి ఎమ్మెల్యేగా సేవలందించిన కాళోజీ ప్రజా సంక్షేమానికే ప్రాధాన్యత ఇచ్చారని చెప్పారు.జీవితాంతం మానవతా విలువలను ఆచరించిన కాళోజీ, మరణానంతరం కూడా తన అవయవాలను దానం చేసి సమాజానికి ఆదర్శంగా నిలిచిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. కాళోజీ ఆశయాలు, మానవతా దృక్పథం, సామాజిక న్యాయం కోసం చూపిన మార్గాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలని పిలుపునిచ్చారు.అదే విధంగా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.అనిల్ కుమార్, అధికారులు, కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, ఐడిఒసి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన విద్యాబోధన : కలెక్టర్



**ప్రజాపక్షం/దేవరుప్పుల:** విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు క్రీడలలో పాల్గొనే విధంగా ప్రత్యేక శ్రద్ద వహించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఉపాధ్యాయులకు సూచించారు. బుధవారం మండలంలోని కోలుకొండ జెడ్పీ హెచ్ఎస్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వంట శాలలో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. విద్యార్థులకు పరిశుభ్రమైన ఆహారాన్ని సకాలంలో అందించడంతోపాటు స్వచ్ఛమైన తాగునీటిని అందుబాటులో ఉంచాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించేలా తీర్చిదిద్దాలని తెలిపారు. ఈ తనిఖీలో జిల్లా వ్యవసాయాధికారి అంబికా సోని, ఎంపీడీవో మేక, హెచ్ఎం వెంకన్న, పంచాయితి కార్యదర్శి తిరుపతిరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రత్యేక సమగ్ర సవరణ తాజా వివరాలు
# రాజకీయ పార్టీలకు వెల్లడించాలి

పోలింగ్ కేంద్రాల వారీగా దావాలు, అభ్యంతరాలు జాబితాల అందజేత

జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు



**ప్రజాపక్షం/ములుగు:** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ....2026కు సంబంధించిన తాజా వివరాలను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఎప్పటికప్పుడు వెల్లడించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు ఎన్నికల అధికారులను ఆదేశించారు. బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని మినీ సమావేశ మందిరంలో 109 ములుగు ఎస్‌టి శాసనసభ నియోజకవర్గానికి సంబంధించిన గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రత్యేక సమగ్ర ఓటరు ప్రక్రియలో చేపడుతున్న ప్రతి అంశాన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులకు తెలియజేయాలని సూచించారు. ఎన్నికల సంఘం ప్రత్యేక సమగ్ర సవరణ షెడ్యూల్‌ను అక్టోబర్ 19 నుండి నవంబర్ 9 వరకు పొడిగించిన నేపథ్యంలో, సవరించిన షెడ్యూల్ ప్రతులను రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేసినట్లు తెలిపారు. సెప్టెంబర్ 2 నుండి 8వ తేదీ వరకు అందిన దావాలు, అభ్యంతరాలకు సంబంధించిన ఫారాలు 9, 10, 11 జాబితాలను రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేశారు. పోలింగ్ కేంద్రాల వారీగా అందిన దావాలు, అభ్యంతరాలు, ఓటర్లకు జారీ చేసిన నోటీసులు, వాటి ప్రస్తుత స్థితికి సంబంధించిన వివరాలను సమావేశంలో వెల్లడించారు. నియోజకవర్గ పరిధిలోని 308 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన సమాచారాన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై ఏవైనా అభ్యంతరాలు, సలహాలు, సూచనలు ఉంటే ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియకు సంబంధించి రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తం చేయలేదని అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో ఎన్నికల నమోదు అధికారి, ఆర్‌డిఓ కృష్ణవేణి, ఎన్నికల విభాగం అధికారులు, గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## వినాయక విగ్రహాల నిమజ్జనానికి స్థల పరిశీలన

**ప్రజాపక్షం/ఆత్మకూరు :** వినాయక విగ్రహాల నిమజ్జనానికి అనువైన మండలంలోని కటాక్షపూర్ పెద్ద చెరువును తహసీల్దార్ జగన్మోహన్ రెడ్డి బుధవారం పరిశీలించారు. మండల పరిషత్తు అభివృద్ధి అధికారి శ్రీనివాస్ రెడ్డి, సర్కిల్ ఇన్స్పెక్టర్ బాబు లాల్ తో కలిసి చెరువు వద్దకు వెళ్లారు. నిమజ్జనానికి చెరువులో నీటిమట్టం తక్కువగా ఉండటంతో లోతుగా నీరు ఉన్న ప్రాంతాన్ని పరిశీలించారు. నిమజ్జన సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగానే అన్ని ఏర్పాట్లు చేయాలని స్థానిక అధికారులకు సూచించారు.నీటిపారుదల శాఖ సహాయక ఇంజినీర్ విజయ, సర్పంచ్ సయ్యద్ మౌలా, ఉప సర్పంచ్ లక్ష్మి రాంబాబు, పంచాయతీ కార్యదర్శి అమిత్ రెడ్డి, వార్డు సభ్యులు గోరిబీ హుస్సేన్,గ్రామస్థులు పాల్గొన్నారు.

## గణేష్ మంటపాల నిర్వాహకులకు పోలీసుల సూచనలు



**ప్రజాపక్షం /శాయంపేట :** గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా శాయంపేట మండలంలోని వివిధ గ్రామాల్లో గణేష్ మండపాలు ఏర్పాటు చేస్తున్న నిర్వాహకులు, సభ్యులను శాయంపేట పోలీసులు పిలిపించి తగు సూచనలు, జాగ్రత్తలను తెలియజేశారు.శాయంపేట సిఐ సుధాకర్ రెడ్డి అధ్యక్షతన, ఎస్ఐ పరమేష్ సమక్షంలో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా నిర్వాహకులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.మండపాల వద్ద భద్రతా చర్యలు పాటించాలని, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చూడాలని, నిబంధనలకు అనుగుణంగా ఉత్సవాలు నిర్వహించాలని పోలీసులు సూచించారు. ప్రజలు, భక్తులు సహకరించి గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించుకోవాలని కోరారు.

## ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని పరిశీలించిన అధికారి

**ప్రజాపక్షం/హసన్‌పర్తి :** హనుమకొండ జిల్లా హసన్ పర్తి మండలం కేంద్రంలో నిగతంలో సర్ కార్యక్రమంలో రిజెక్ట్ అయిన ఓటర్ల జాబితాను అధికారి కందగట్ల రమాకాంత్ బుధవారం రోజు పరిశీలించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో జరుగుతున్న కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేయడంలో భాగంగా హసన్ పర్తి లోని తొమ్మిదవ వార్డ్ లో జరుగుతున్న కార్యక్రమాన్ని ఆకస్మిక సందర్శించారు. అప్పటికే సుమారు పదికి పైగా దరఖాస్తులు నమోదు చేసే బిఎల్ఓ సెంటర్లోనే ఉన్నారు. అది గమనించి మిగతా నమోదు కాని ఓటర్లను వివరాలడిగి తెలుసుకున్నారు. ఈ నెలాఖరు లోపు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగపరచుకోవాలని ఆయన ఓటర్లను కోరారు. ఆయన వెంట ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# కెసిఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యేను తక్షణమే అరెస్టు చేయాలి

### ఎల్కతుర్తి బిఆర్ఎస్ నాయకుల డిమాండ్



**ప్రజాపక్షం/ ఎల్కతుర్తి :** తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కెసిఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌పై చర్యలు తీసుకుని, తక్షణమే అరెస్టు చేయాలని బిఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎల్కతుర్తి మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ నరసింహారావుకు బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు పిట్టల మహేందర్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా పిట్టల మహేందర్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమించి, 60 ఏళ్ల తెలంగాణ ప్రజల కలను సాకారం చేసిన నాయకుడు కెసిఆర్ అని అన్నారు. రెండు పర్యాయాలు తెలంగాణను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లిన కెసిఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని పేర్కొన్నారు. ప్రజల మనోభావాలను దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకుని, తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్షాల నిరసనలను అడ్డుకోవడం, దౌర్జన్యంగా అరెస్టులు చేయించడం సరికాదని విమర్శించారు.ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాలకు నిరసన తెలిపే హక్కు ఉందని, ప్రభుత్వం ఆ హక్కులను కాలరాయకూడదని అన్నారు.కెసిఆర్‌పై చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని, ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ శ్రీపతి రవీందర్ గౌడ్, వైస్ చైర్మన్ మునిగడప శేఖర్ గౌడ్, బిఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి జూపాక జద్వన్, నాయకులు ఎల్లారి స్వామి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ తంగెడ మహేందర్, మాజీ వైస్ ఎంపిపి నాగేష్, ఎంపిటిసిల ఫోరం మాజీ అధ్యక్షులు కడారి రాజు, బిఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు గొల్ల మహేందర్, మాజీ సర్పంచ్ కుర్ర సాంబమూర్తి గౌడ్, సీనియర్ నాయకులు మదన్ మోహన్ రావు, ఒడితల యువసేన అధ్యక్షులు చిట్టి గౌడ్, భాష బోయిన సురేష్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## గణపతి నవరాత్రి ఉత్సవాల కరపత్రాన్ని ఆవిష్కరించిన ఎంపి

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** చారిత్రక వేయి స్తంభాల దేవాలయంలో శ్రీ ఉచ్ఛిష్ట గణపతి నవరాత్రి మహోత్సవాలకు సంబంధించిన కరపత్రాన్ని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ఆవిష్కరించారు. సెప్టెంబర్ 14 నుంచి 23వ తేదీ వరకు నిర్వహించనున్న నవరాత్రి మహోత్సవాలను భక్తిశ్రద్ధలతో విజయవంతం చేయాలని ఎంపీ ఆకాంక్షించారు.ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య ఆలయంలోని శ్రీ రుద్రేశ్వరస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక అభిషేకం, పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేద మంత్రోచ్ఛారణల మధ్య ఎంపీకి వేద ఆశీర్వచనం అందించారు.ఆధ్యాత్మిక, చారిత్రక వైభవానికి ప్రతీకగా నిలిచిన వేయిస్తంభాల ఆలయంలో నిర్వహించే గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి



ఆశీస్సులు పొందాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య ఆకాంక్షించారు. ఉత్సవాల సందర్భంగా ఆలయ నిర్వాహకులు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని, కార్యక్రమాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో డి. అనిల్ కుమార్,ప్రధానార్చకులు గంగు ఉపేంద్ర శర్మ, మణికంఠ అవధాని, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విబి–జి రామ్ జి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజాపక్షం / వేలేరు :** భారత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన వీబీజీ రామ్ జీ పథకం గ్రామీణ ప్రాంతాల ఆర్థిక పురోగతికి మరియు మౌలిక సదుపాయాల కల్పనకు ఒక గొప్ప అవకాశమని శాలపల్లి గ్రామసర్పంచ్ కూరపాటి అశోక్ ,ఎపిఒ విజయ అన్నారు.మంగళవారం శాలపల్లి గ్రామపంచాయితీ కార్యాలయంలో ఈసమావేశాన్ని ఏర్పాటు చేశారు.ఈసందర్భంగా వారు వారు మాట్లాడుతూ వీబీజీ రామ్ జీ పథకం ద్వారా 125 రోజుల ఉపాధి గ్యారంటీ పనిదినాలను పెంచి.ప్రతి గ్రామీణ కుటుంబాలకు చట్టబద్ధత కల్పిస్తున్నారని అన్నారు,ఈపథకంలో పనిచేసిన వారికి రోజు వారిగా రూ,300 వేతనం నేరుగా వారి ఖాతాలో జమచేయడం జరుగుతోందని ఈపథకం వికసిత్ గ్రామపంచాయితీ ప్రణాళికల ద్వారా జరుగుతోంది కాబట్టి మీగ్రామానికి అవసరమైన నీటి సంరక్షణ,రహదారులు గ్రామాలలో చేయడం వలన గ్రామ రూపురేఖలు మారుతాయి కనుక ఈసదావాకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.కార్యక్రమంలో గ్రామసర్పంచ్ కూరపాటి అశోక్,ఉపసర్పంచ్ ఎర్రగొల్ల రమేష్,కార్యదర్శి లక్ష్మణ్,ఫీల్డ్ అసిస్టెంట్ సంపత్,సతీష్,అంగన్‌వాడి టీచర్,మహిళలు,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## నాగారం గ్రామంలో కందిపంటపై ఫామ్ స్కూల్ నిర్వహణ

**ప్రజాపక్షం/హసన్ పర్తి :** నాగారం గ్రామంలో కంది పంటపై ఆకు ముడత నివారణకు మండల వ్యవసాయ అధికారి అడ్లూరి అనూరాధ ఫామ్ స్కూల్ (వ్యవసాయపాఠశాల) నిర్వహించారు.హనుమ కొండ జిల్లా హసన్ పర్తి మండలం నాగారం గ్రామంలో బుధవారంరైతు నేతాని ఉమా కందిచేనులో వ్యవసాయ పాఠశాల కార్యక్రమాన్ని వ్యవసాయ అధికారి అడ్లూరి అనురాధ నేతృత్వంలో ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా(ఏడిఏ )వ్యవసాయ శాఖ సంచాలకులు ఆదిరెడ్డి హాజరై రైతులతో కలిసి కంది పంటను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ పరిశీలనలో కంది పంటను ప్రస్తుతం ఆకులు ముడుత లేదా జూలి పురుగు ఆశించినట్లుగా వ్యవసాయ సంచాలకులు ఆదిరెడ్డి తో పాటు వ్యవసాయశాఖ అధికారులు గుర్తించారు.ఈసందర్భంగా యాంత్రిక పద్ధతిలో పొలంలో ప్రాథమిక దశలో కనిపించే ఆకు జాలీలను లోపల ఉన్న పురుగుతో సహా తెంపి నాశనం చేయాలిని రైతులకు ఏ డి ఏ ఆదిరెడ్డి రైతులకు సూచించారు. అలాగే ఎకరానికి 20 చొప్పున టి ఆకారపు కర్రలను నాటడం ద్వారా పక్షులు పురుగులను ఏరి తింటాయని తెలిపారు.జీవ/సేంద్రియనియంత్రణ ఉధృతి తక్కువగా ఉంటే 5 శాతం వేప గింజల కషాయం (ఎన్ ఎస్ కే ఇ ) లేదా 10,000 పి పి ఎంవేప నూనెను ఎకరానికి 300 మి.లీ చొప్పున పిచికారీ చేయాలి.రసాయనిక నివారణ పురుగు ఉధృతి ఎక్కువగా ఉన్నట్లు గమనిస్తే, లీటరు నీటికి క్వినాల్ఫాస్ 2 మి.లీ లేదా క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ లేదా ఎమామెక్టిన్ బెంజోయేట్ 0.5 గ్రాము చొప్పున కలిపి, మందు జాలీల లోపలికి వెళ్లేలా మొక్క చివర్లపై బాగా తడిచేలా పిచికారీ చేయాలని వ్యవసాయ అధికారులు రైతులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఆత్మ బి.ఎఫ్.ఎ.సి సభ్యులు లింగారెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారులు శైలజ, సుమన్, సాయి, బిందు, సానియా నాగారం గ్రామానికి చెందిన రైతులు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

## సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

**ప్రజాపక్షం/నెక్కొండ:** అనారోగ్యంతో కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నలుగురు బాధిత కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి(సిఎంఆర్ఎఫ్) అండగా నిలిచింది. నెక్కొండ పట్టణంలోని ఆర్అండ్‌బి అతిథి గృహంలో టిపిసిసి సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి నెక్కొండ సర్పంచ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పెండ్యాల హరిప్రసాద్ లబ్ధిదారులకు సిఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. దేశబోయిన ఆశయకు రూ.20వేలు, ఎండి చాందుకు రూ.12వేలు, దుగ్గి భాస్కర్‌రెడ్డికి రూ.50,500, సంపంగి తిరుపతయ్యకు రూ.96వేల చొప్పున చెక్కులు అందించారు. ఈ సందర్భంగా రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ వైద్య ఖర్చులతో ఇబ్బందులు పడుతున్న పేద కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి కుసుమ చెన్నకేశవులు, పట్టణ అధ్యక్షుడు ఇదునూరి సాయికృష్ణ, సొసైటీ డైరెక్టర్ కెవి సుబ్బారెడ్డి, మార్కెట్ డైరెక్టర్ రావుల మహిపాల్‌రెడ్డి, ఎన్ఎస్‌యూఐ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బోడ శ్రీకాంత్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## క్లిష్టమైన గుండె సమస్యతో బాధపడుతున్న వృద్ధుడికి చికిత్స

**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** బైకస్పిడ్ అయోర్టిక్ వాల్వ్‌తో పాటు తీవ్రమైన అయోర్టిక్ స్టెనోసిస్, గణనీయమైన అసెండింగ్ అయోర్టిక్ డైలటేషన్‌తో బాధపడుతున్న 78 ఏళ్ల పురుష రోగికి ట్రాన్స్‌కాథెటర్ అయోర్టిక్ వాల్వ్ ఇంప్లాంటేషన్ (టావీ) ద్వారా విజయవంతంగా చికిత్స అందించినట్లు మెడికవర్ వైద్యులు తెలిపారు.బైకస్పిడ్ అయోర్టిక్ వాల్వ్ అనేది పుట్టుకతో వచ్చే గుండె సంబంధిత లోపం. సాధారణంగా అయోర్టిక్ వాల్వ్‌లో మూడు లీఫ్లెట్లు (కవాటాలు) ఉండగా, ఈ పరిస్థితిలో రెండు మాత్రమే ఉంటాయి. కాలక్రమేణా ఈ అసాధారణ నిర్మాణం కారణంగా వాల్వ్ క్రమంగా ఇరుకుగా మారి తీవ్రమైన అయోర్టిక్ స్టెనోసిస్‌కు దారితీస్తుంది. దీంతో గుండెపై అదనపు ఒత్తిడి పడుతుంది.ఈ రోగిలో బైకస్పిడ్ అయోర్టిక్ వాల్వ్‌తో పాటు అసెండింగ్ అయోర్టా గణనీయంగా విస్తరించి ఉండటం, అలాగే అయోర్టా అడ్డంగా (హారిజాంటల్‌గా) ఉండటం వల్ల కేసు మరింత క్లిష్టంగా మారింది. ఈ సంక్లిష్ట శరీర నిర్మాణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని హార్ట్ టీమ్ సమగ్ర పరిశీలన, అధునాతన ఇమేజింగ్ పరీక్షలు, అత్యంత జాగ్రత్తతో కూడిన ప్రణాళికను రూపొందించారు.ఈ అత్యాధునిక, మినిమల్లీ ఇన్వేసివ్ విధానంలో తొడ భాగంలోని రక్తనాళం (ఫెమొరల్ ఆర్టరీ) ద్వారా కొత్త కృత్రిమ వాల్వ్‌ను గుండెకు చేరవేసి, దెబ్బతిన్న అయోర్టిక్ వాల్వ్ స్థానంలో అమర్చారు.ఈ క్లిష్టమైన టావీ ప్రక్రియను సీనియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ సంతోష్ మోదాని విజయవంతంగా నిర్వహించారు. ఆయనకు బహుళ విభాగాల కార్డియాక్ బృందానికి చెందిన డాక్టర్ శ్రవణ్ కుమార్ రాంపల్లి, డాక్టర్ షఫీ, డాక్టర్ వాసు సహకారం అందించారు. కొత్తగా అమర్చిన వాల్వ్ సమర్థవంతంగా పనిచేస్తుండగా, అయోర్టిక్ వాల్వ్ ద్వారా రక్తప్రసరణ గణనీయంగా మెరుగుపడింది.చికిత్స అనంతరం రోగి వేగంగా కోలుకుని ప్రస్తుతం ఆరోగ్యంగా, స్థిరమైన పరిస్థితిలో ఉన్నారు.ఈ క్లిష్టమైన కేసు ద్వారా అధునాతన స్ట్రక్చరల్ హార్ట్ ఇంటర్వెన్షన్లు, ఖచ్చితమైన శరీర నిర్మాణ అంచనా, బహుళ విభాగాల హార్ట్ టీమ్ సమన్వయంతో కూడిన వైద్య విధానం ద్వారా సంక్లిష్ట గుండె సమస్యలతో బాధపడుతున్న వృద్ధ రోగులకు సమర్థవంతమైన చికిత్స అందించవచ్చని మరోసారి రుజువైంది.ఈ విజయవంతమైన ఫలితం సరైన రోగి ఎంపిక, అధునాతన ఇమేజింగ్ సాంకేతికత, ఖచ్చితమైన ప్రణాళిక, అంకితభావంతో పనిచేసిన మెడికవర్ బహుళ విభాగాల కార్డియాక్ బృందం సమిష్టి కృషికి నిదర్శనంగా నిలిచింది.

## సామూహిక నిధి పథకం బీమా డబ్బులు అందజేత

**ప్రజాపక్షం/ నర్సంపేట :** నర్సంపేట మండలం చంద్రయ్యపల్లి గ్రామంలో చంద్ర పురుషుల పొదుపు సంఘం సభ్యుడు బానోతు రాజయ్య ఇటీవల మృతిచెందాడు. ఈ నేపథ్యంలో మృతిని కుటుంబ సభ్యులు, భార్య సారమ్మకు సామూహిక నిధి పథకం నుండి రూ. 70 వేలు, అభయనిధి పథకం నుండి రూ.10 వేలు మొత్తం 80 వేల రూపాయలు భీమా డబ్బులను దుగ్గొండి సమితి అధ్యక్షులు ముదురుకోల నర్సయ్య,సంఘం అధ్యక్షుడు కందుల శ్రీనివాస్ గౌడ్ పాలక వర్గం సభ్యులతో కలిసి బుధవారం అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు వద్దేపల్లి మృత్యుంజయుడు, బానోతు రమేష్, భాషబోయిన రాజు, ఉప్పుల రాజు, సల్వాల ప్రభాకర్, పాక రాజయ్య, సయ్యద్ బషీర్, భాషబోయిన చరణ్ రాజ్, మాటేటి కోటిలింగం, భాషబోయిన సుధాకర్, వరంగంటి కృష్ణారెడ్డి, గణకులు ఎడెల్లి మహేందర్ రెడ్డి, మాజీ పాలకవర్గ సభ్యుడు బానోతు సాంబయ్య పాల్గొన్నారు.

# మట్టి గణపతినే ప్రతిష్టిద్దాం



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** పర్యావరణాన్ని కాపాడి భావితరాలకు ఆరోగ్యకరమైన భవిష్యత్తును అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ప్రముఖ సాహితీవేత్తలు, కవులు పిలుపునిచ్చారు. మట్టి గణపతినే ప్రతిష్టిద్దాం అనే నినాదంతో ప్రముఖ సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్ చేపట్టిన ఏడు రోజుల విస్తృత ప్రచార కార్యక్రమం మూడవ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన ప్రముఖ కవులు, రచయితలు, కాళోజీ ఫౌండేషన్ సభ్యులను కలిసి మట్టి గణపతి ప్రతిష్టాపన ఆవశ్యకతపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా బుధవారం రవీంద్రభారతిలోకాళోజీ పురస్కారం అందుకోబోతున్న పురస్కార గ్రహీత ఆర్.ఎస్. విద్యార్థి మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ మనందరి సామాజిక బాధ్యత అని అన్నారు. ప్రతి ఒక్కరూ పర్యావరణహితమైన మట్టి గణపతులను ప్రతిష్టించాలని పిలుపునిచ్చారు.కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత అంపశయ్య నవీన్ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మట్టి గణపతినే ప్రతిష్టించాలని సూచించారు. ఈ అంశంపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి నిమ్మల శ్రీనివాస్ చేపడుతున్న కార్యక్రమాన్ని ఆయన అభినందించారు.డీజే సౌండ్‌లను మితిమీరి వినియోగించడం ద్వారా ధ్వని కాలుష్యానికి కారణం కాకుండా, పండుగలను ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా నిమ్మల శ్రీనివాస్ ప్రముఖులకు మట్టి గణపతి ప్రతిమలను అందజేశారు. నగరంలోని పలు స్వచ్ఛంద సంస్థలు శని, ఆదివారాల్లో ఉచితంగా మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఉచిత మట్టి విగ్రహాల పంపిణీ వివరాల కోసం 9949709866 నంబర్‌ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాళోజీ అభిమానులు డాక్టర్ రాజకుమార్, , కడారి సేవ ఫౌండేషన్ ట్రస్ట్ బాధ్యులు కడారి శ్రీనివాస్, సభాపతి తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు పర్కిరించాలి

**ప్రజాపక్షం/మరిపెడ:**ఉద్యోగ,ఉపాద్యాయుల సమస్యల సాధనకై తెలంగాణ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటి తల పెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమానికి ఉద్యోగులు భారిగా తరలిరావలనీ టిజిఇజెఎసి పిలుపు నిచ్చింది.ఈ మేరకు బుధవారం స్థానిక జెడ్‌పిహెచ్ఎస్ సీతారాంపురం పాఠశాలలో భోజనవిరామ సమయంలో వివిధ ఉపాద్యాయ సంఘల బాధ్యులు పాల్గొని నిరసన తెలిపారు.ఈ సందర్భంగా నాయకులు నల్ల పవన్‌కూమర్ మాట్లడుతూ,గత మూడు సంవత్సరాలుగా ఉద్యోగుల సమస్యల పరిష్కరం విషయంలో ప్రభుత్వం నాన్చివేత ధోరణి అవలంభిస్తోందనీ,తక్షణమే సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలనీ డిమాండ్ చేశారు.జెఎసి భాద్యులు వేంకటేశ్వరావు, అర్జున,మురళికృష్ణ,హఫీజ్,మంగు,రవి,సోమ్లు,జహిరుద్దీన్,సందిప్,బివిఆర్,మంజుభార్గవి,ఉమారాణి,ఇందిర,ఆదిలక్ష్మి ,ప్రభావతి,పాల్గొన్నారు.

## మేరు కులబంధువులంతా ఐక్యంగా ఉండాలి

**ప్రజాపక్షం/జఫర్‌గడ్:** మేరుకుల బంధువులంతా ఐక్యతతో ముందుకు సాగుతూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మేరు సంఘం అధ్యక్షుడు రాపర్తి ప్రశాంత్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు కొండ రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా మేరు సంఘం ముఖ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర మేరు కార్పోష్ ఏర్పాటు చేసినందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఉచిత కుట్టు మిషన్ల పథకానికి అర్హులైన ప్రతి ఒక్కరు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుల జాబితాను సెప్టెంబర్ 16లోపు సిద్ధం చేసి, 17న ఎమ్మెల్యేలు, జిల్లా కలె క్టర్‌కు అందించాలని నిర్ణయించారు. రాష్ట్ర కమిటీకి జిల్లా నుండి ప్రతినిధిని ఎంపిక చేయడం తోపాటు 2027 నూతన క్యాలెండర్ రూపొందించాలని సమావేశంలో తీర్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటి సభ్యులు వెంకట నారాయణ, సుధాకర్, సోమ సత్యం, యాదగిరి, శ్రీనివాస్, రవి, అశోక్ పాల్గొన్నారు.

## రసాయనాల వాడకం తగ్గించాలి

**ప్రజాపక్షం/దేవరుప్పుల:** మట్టి ఆరోగ్యాన్ని కాపాడేందుకు రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి, మట్టి పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సూచించారు. కోల్కొండ జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన స్కూల్ సాయిల్ హెల్త్ ప్రోగ్రామ్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అదికారి అంబికా సోని, మండల వ్యవసాయాధికారి మనోహిత్ విక్రమ్ రావు, వ్యవసాయ విస్తరణాధికారి శ్యామల, హెచ్ఎం వెంకన్న, ఉపాధ్యాయులు, వ్యవసాయాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఆత్మీయ భరోసా నిధులు విడుదల చేయాలి

### వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి బొడ్డు కిషోర్

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద భూమిలేని పేదలకు ఏడాదికి రూ. 12 ,000 అందిస్తామని ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో, ఆ హామీ అమలుకు తగిన బడ్జెట్‌ను వెంటనే కేటాయించాలని వ్యవసాయక కార్మిక సంఘం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కార్యదర్శి బొడ్డు కిషోర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లావ్యాప్తంగా అసైన్డ్ భూములు, పోడు భూములను సాగు చేసుకుంటున్న అర్హులైన దళితులు, గిరిజనులకు భూ హక్కు పట్టాలు మంజూరు చేయాలని కోరారు. పేదలు సాగు సమయంలో ఇబ్బందులు పడకుండా యూరియా కొరత లేకుండా తగినంత ఎరువులను ముందుగానే అందుబాటులో ఉంచాలని ప్రభుత్వాన్ని కోరారు. 2023 ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ 42 పేజీల ఎన్నికల మేనిఫెస్టోలో 62 అంశాలు, 6 గ్యారంటీలను 100 రోజుల్లో అమలు చేస్తామని హామీ ఇచ్చిందని, అయితే ప్రభుత్వం ఏర్పడి చాలా కాలం గడిచినా కొన్ని హామీలు ఇంకా పూర్తిస్థాయిలో అమలు కాలేదని బొడ్డు కిషోర్ విమర్శించారు. పెండింగ్‌లో ఉన్న హామీలను తక్షణమే అమలు చేసేందుకు ప్రభుత్వం పటిష్టమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కుటిల ప్రయత్నాలను తక్షణమే విరమించుకోవాలని బొడ్డు కిషోర్ డిమాండ్ చేశారు. గ్రామీణ పేదలకు ఉపాధి, కనీస ఆదాయ భద్రత కల్పించే ఉపాధి హామీ చట్టాన్ని కాపాడేందుకు రానున్న రోజుల్లో వ్యవసాయక కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఉద్యమాలను మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

# ఐటిడిఏ నూతన భవనం సర్వే నంబర్ 209 లో నిర్మించాలి

### మన్యసీమ పరిరక్షణ సమితి డోలు దెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు గొప్ప వీరయ్య

**ప్రజాపక్షం/మంగపేట :** ములుగు జిల్లా షెడ్యూల్ ఏరియా ఏజెన్సీ ప్రాంతం ఏటూరు నాగారం లో ఆదివాసుల అభివృద్ధి ఆదివాసిల సమస్యలు పరిష్కరించుటకు వారి జీవోలు గిరిజన చట్టాలు ఆర్టికల్స్ అమలుకై 1974 లో ఐటిడిఏ కార్యాలయమును మొట్టమొదట వరంగల్ లో స్థాపించబడింది. ఇట్టి ఐటిడిఏ కార్యాలయం 5వ షెడ్యూల్ భూభాగంలోనే ఏజెన్సీ ప్రాంతంలో ఉండాలని అప్పటి పిఓ సత్యనారాయణ 1985 లో ఏటూరు నాగారం బ్లాక్ సమితి పరిధిలోని ఆకులవారి ఘనపురం గ్రామంలో ఏజెన్సీ ప్రాంతంలో ఉండాలని వరంగల్ నుండి ఏటూరునాగారం మండల పరిధి ఆకుల వారి ఘనపురానికి మార్చబడింది ఇట్టి కార్యాలయమును ఏక్కెల గ్రామ శివారులో ఆర్టికల్చర్ షేరికల్చర్ ప్రభుత్వ శాఖలకు కేటాయించబడిన భూమి స్థలములో మంజూరైన 16 కోట్ల రూపాయలతో నూతన ఐటీడీఏ భవనం నిర్మించుటకు ప్రభుత్వం చేస్తున్న ఆలోచనలను మన్యసీమ పరిరక్షణ సమితి డోలు దెబ్బ ఖండిస్తుంది ఇప్పటికైనా మంత్రి సీతక్క గిరిజన ఎమ్మెల్యేలు గిరిజన ఎంపీలు జిల్లా కలెక్టర్ ఐటిడిఏ పిఓ గిరిజనులకు మారుమూల ప్రాంతం దూరంగా మార్చాలనే ప్రయత్నం మానుకోవాలి. ఎందుకంటే ఇంత రోడ్డు దగ్గర ఉంటేనే ఆదివాసులు సమస్యలు చెప్పుకోవడానికి రావడం లేదు మరి మారుమూల ప్రాంతాములో ఐటిడిఏ కట్టుతే అక్కడికి రవాణా సౌకర్యం ఉండదు మా ఆదివాసులు ఐటిడిఏ ఎక్కడ ఉన్నదో కూడా తెలియదు కాబట్టి మాకు మా ఆదివాసి ప్రజలకి అందుబాటులో ఉండాలంటే ఆకుల వారి ఘనపురం గ్రామ శివారు సర్వే నెంబర్ 209లో 125 /26 ఎకరాల గుంటల ప్రభుత్వ భూమి ఉన్నది. అందులోనే 22.6 గుంటలు చెరువు శిఖం భూమి పోగ మిగిలిన 10320 ఎకరాల గుంటల ప్రభుత్వ భూమి కలదు ప్రభుత్వ కార్యాలయాలు ఐటిడిఏ కార్యాలయాలు ప్రజలకు అందుబాటులో రోడ్డు పక్కన ఉండాలి కానీ మారుమూల ప్రాంతమైన ఎక్కేలా శివారులో ఆర్టికల్చర్ షేర్ కల్చర్ ప్రభుత్వ శాఖలకు కేటాయించబడిన స్థలంలో భావన నిర్మాణాన్ని చేయాలనే ప్రయత్నం మానుకోవాలి. సర్వే నంబర్ 209 ప్రభుత్వ భూమిలో 10 ఎకరాలలో మంజూరైన 16 కోట్లతో నూతన ఐటీడీఏ భవనాన్ని నిర్మించాలని, మన్య సీమ పరిరక్షణ సమితి డోలు దెబ్బ డిమాండ్ గతంలో కూడా చందులాల్ మంత్రిగా ఉన్నప్పుడు ఎక్కేలా శివార్లు కట్టాలని ప్రయత్నం చేశారు. కానీ అప్పుడు కూడా ఆదివాసి సంఘాలు అడ్డుకోవడం జరిగింది ఈ కార్యక్రమంలో మన్యసీమ పరిరక్షణ సమితి డోలు దెబ్బ రాష్ట్ర అధ్యక్షులు గొప్ప వీరయ్య, మన్యసీమ పరిరక్షణ సమితి డోలు దెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఈసం యాదయ్య, జిల్లా అధ్యక్షులు ఈసం రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి తోలేం సుధాకర్, మంగపేట మండల అధ్యక్షుడు తాటి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఆశా వర్కర్లపై లాఠీచార్జ్ దుర్మార్గం

### సిఐటియుజిల్లా అధ్యక్షుడు కొప్పుల రఘుపతి రావు

**ప్రజాపక్షం/వాజేడు :**ఎన్నికల ముందు అశా వర్కర్లకు నెలకు రూ.18 వేల వేతనం ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తవుతున్నా ఆ హామీని అమలు చేయడం లేదని సిఐటియు జిల్లా అధ్యక్షుడు కొప్పుల రఘుపతి రావు విమర్శించారు. హామీని అమలు చేయాలని కోరుతూ చేపట్టిన చలో అసెంబ్లీ కార్యక్రమంలో ఆశా వర్కర్లను అరెస్టు చేయడంతో పాటు నిరసన చేస్తున్న వారిపై లాఠీ చార్జ్ చేయడం దుర్మార్గమని అన్నారు. బుధవారం సిఐటియు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. మహిళా ఆశా వర్కర్లపై లాఠీ చార్జ్ ఘటనకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.లాఠీ చార్జ్‌కి నిరసనగా రాష్ట్రవ్యాప్త నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. తహసీల్దార్ కార్యలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు.

## కాళోజి జీవితం నేటి తరానికి ఆదర్శం: కలెక్టర్

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** ప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు జీవితం ఆయన చూపిన మార్గం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. కాళోజీ 112వ జయంతి సందర్భంగా మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కాళోజీ తన కవిత్వం, రచనలు, ఉద్యమ స్ఫూర్తితో ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చారని తెలిపారు. తెలంగాణ ప్రజల జీవన విధానం, భాష, యాస, సంస్కృతి, ప్రజల ఆకాంక్షలను తన సాహిత్యంలో ప్రతిబింబించిన గొప్ప ప్రజాకవి అని కొనియాడారు. సామాజిక అసమానతలు, అన్యాయాలపై ప్రశ్నిస్తూ ప్రజల పక్షాన నిలిచిన కాళోజీ సాహిత్యం నేటికీ స్ఫూర్తిదాయకమన్నారు. తెలంగాణ భాష, యాస, నుడికారానికి కాళోజీ చేసిన సేవలను గుర్తిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆయన జయంతిని తెలంగాణ భాషా దినోత్సవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యువత ఆయన విలువలను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. కాళోజీ ఆశయాల సాధనకు కృషి చేయడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి , బిసి సంక్షేమ అధికారి ఇందిర ఇతర శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

## పారదర్శకంగా ఓటరు సవరణ ప్రక్రియ నిర్వహణ

**ప్రజాపక్షం/రాయపర్తి:** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు కొనసాగుతున్న ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించాలని మండల ఆర్ఐ చంద్రమోహన్ కోరారు. బుధవారం మండలంలోని కాట్రపల్లి గ్రామంలో గ్రామ పంచాయతీ ఆవరణలో ప్రత్యేక ఓటర్ల సమగ్ర సవరణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఓటర్ల అభ్యంతరాల ఫారాలను సిబ్బంది చేత బిఎల్ఓల లాగిన్‌లో ఆన్‌లైన్ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఎల్ఓలు నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా పారదర్శకంగా ప్రతి ఒక్కరి అభ్యంతరాల ఫారాలను సవరించి ఆన్‌లైన్‌లో ఎంటర్ చేయాలన్నారు. అర్హత కలిగిన ప్రతి పౌరుడు తమ యొక్క పేరు ఓటర్ లిస్టులో ఉందో లేదో తెలుసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే వెంటనే తెలియజేయాలని సూచించారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ గుండ్లపల్లి మధు, రెవెన్యూ సిబ్బంది పద్మ, శిరీష, రోజా, కార్యదర్శి రాజేందర్, బిఎల్ఓలు ఎండి యాకుబీ, రమాదేవి, కారోబార్ రఘు, గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు, పాల్గొన్నారు.

## స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన తాతా మధును సస్పెండ్ చేయాలి

### డిహెచ్ పిఎస్ జిల్లా కార్యదర్శి పొనంగటి లావణ్య




**ప్రజాపక్షం/భూపాలపల్లి :** శాసనసభ స్పీకర్‌పై ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత, వ్యక్తిగత వ్యాఖ్యలను దళిత హక్కుల పోరాట సమితి భూపాలపల్లి జిల్లా సమితి తీవ్రంగా ఖండించారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలో డిహెచ్పిఎస్ ఆధ్వర్యంలో ప్రెస్ మీట్ నిర్వహించారు. అనంతరం డిహెచ్పిఎస్ జిల్లా కార్యదర్శి పొన్నగంటి లావణ్య మాట్లాడుతూ శాసనసభ స్పీకర్‌పై ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత, వ్యక్తిగత వ్యాఖ్యలను దళిత హక్కుల పోరాట సమితి భూపాలపల్లి జిల్లా సమితి తీవ్రంగా ఖండించారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న స్పీకర్‌ను వ్యక్తిగతంగా అవమానించడం శాసనసభ గౌరవాన్ని, ప్రజాస్వామ్య విలువలను కించపరచడమేనని జిల్లా కార్యదర్శి పొనంగటి లావణ్య తెలిపారు. రాజకీయ విమర్శలకు హద్దులు ఉండాలని, వ్యక్తిగత దూషణలకు పాల్పడటం ప్రజాప్రతినిధులకు తగదని తెలిపారు. దళిత సమాజానికి చెందిన వ్యక్తి కీలక రాజ్యాంగ పదవిలో ఉన్నందున ఆయనపై అవమానకర వ్యాఖ్యలు చేయడం మరింత అభ్యంతరకరమన్నారు. ఎమ్మెల్సీ తాతా మధును వెంటనే సస్పెండ్ చేసి, వ్యాఖ్యలను ఉపసంహరించుకుని స్పీకర్‌కు బహిరంగ క్షమాపణ చెప్పాలని పొనంగటి లావణ్య డిమాండ్ చేశారు. తక్షణ చర్యలు తీసుకోకపోతే దళిత, ప్రజాస్వామిక శక్తులను కలుపుకుని జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

## నర్సమ్మకు రంజిత్‌రెడ్డి నివాళి

**ప్రజాపక్షం/నెక్కొండ:** నెక్కొండ మండలం అమీన్‌పేట గ్రామానికి చెందిన గరికపాటి నర్సమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న నర్సంపేట నియోజకవర్గ టిపిసిసి సభ్యుడుసొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి ఆమె పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. నెక్కొండ సర్పంచ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పెండ్యాల హరిప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి బక్కి అశోక్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు లావుడియా తిరుమల్, పలువురు కాంగ్రెస్ నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## సర్పంచ్ కుటుంబానికి కాంగ్రెస్ నేతల పరామర్శ

**ప్రజాపక్షం/గూడూరు;** బలరాం తండా సర్పంచ్ ఇస్లావత్ వస్రం నాయక్ సతీమణి ఇస్లావత్ విజయ అనారోగ్యంతో మృతి చెందారు.విషయం తెలుసుకున్న మహబూబాబాద్ గూడూరు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బెల్లంకొండ శ్రీనువాస్ ధరావత్ బాలాజీ నాయక్ పాటు మాసుకోట మండల సర్పంచ్‌లు బోడ హరిలాల్ నాయక్ బానోత్ మంగీలాల్ భూక్యా వీరన్న బానోత్ వెంకన్న గుగులోత్ పంతుల్య రమేష్ తదితర నాయకులు కలిసి వస్రం నాయక్ కుటుంబాన్ని పరామర్శించారు. ఈసందర్భంగా మృతురాలి కటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసి మనోధైర్యంగా ఉండలని కోరారు.

## ఉచిత తాగునీరు కేంద్రం ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్

**ప్రజాపక్షం/నర్సంపేట:** నర్సంపేట పట్టణంలో మల్లంపల్లి రోడ్డు వద్ద న్యూ ప్రతాపరుద్ర ఆటో యూనియన్ ఆధ్వర్యంలో నర్సంపేట మున్సిపల్ చైర్మన్ పెండెం శ్రీ లక్ష్మీ రామానంద్ చేతుల మీదుగా ఉచిత తాగు నీరు కేంద్రాన్ని ప్రారంభించారు. వైనాల శ్రీనివాస్ నారక్కపేట సహకారంతో ఆయన తండ్రి స్వర్గీయ వైనాల సాంబయ్య, సోదరుడు స్వర్గీయరాజు జ్ఞాపకార్థం ఉచిత తాగునీరు సౌకర్యం అందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు, న్యూ ప్రతాపరుద్ర ఆటో యూనియన్ అధ్యక్షుడు బాబు, ఆటో డ్రైవర్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజల ఆరోగ్య రక్షణకు గూడూరు సర్పంచ్ ప్రత్యేక చర్యలు

**ప్రజాపక్షం/గూడూరు;** గూడూరు గ్రామ పంచాయతీ పరిధిలో తాగునీటి స్వచ్ఛతపై ప్రత్యేక దృష్టి సారించారు.సర్పంచ్ వాంకుడోత్ సునీత కోమ్మాలు నాయక్ నీటి ద్వారా సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా ముందస్తు చర్యల్లో భాగంగా నీటి సరఫరా కేంద్రాలు వాటర్ ట్యాంకుల వద్ద బ్లీచింగ్ పౌడర్ చల్లించే కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రజలకు పరిశుభ్రమైన తాగు నీరు అందేలా సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈకార్యక్రమంలో ఉపసర్పంచ్ చంటి స్వామి నాయకలు బీరం శ్రీపాల్ రెడ్డి పానుగంటి వీరస్వామి చప్పట్ల రాము కరీం పాషా సిబ్బంది పాల్గొన్నారు.

## హెచ్ఐవి/ఎయిడ్స్ నియంత్రణలో సమన్వయంతో పనిచేయాలి

### డిఎంహెచ్ఓ డాక్టర్ బి. రాజా రెడ్డి

**ప్రజాపక్షం/ వరంగల్:** హెచ్ఐవి/ఎయిడ్స్ నియంత్రణలో సమన్వయంతో పనిచేయాలని డిఎంహెచ్ఓ డాక్టర్ బి. రాజా రెడ్డి అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలోని సమావేశ మందిరంలో బుధవారం డిస్ట్రిక్ట్ ఎయిడ్స్ ప్రెవెన్షన్ అండ్ కంట్రోల్ యూనిట్ ఉమ్మడి వరంగల్ జిల్లా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఐసిటిసి సిబ్బంది, ఎఆర్‌టి సిబ్బంది, వివిధ స్వచ్ఛంద సంస్థల (ఎన్‌జిఓఎస్) ప్రతినిధులు, సంబంధిత వైద్య సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. రాజా రెడ్డి, వరంగల్ హాజరై ఎచ్ఐవి/ఎయిడ్స్ నివారణ, నియంత్రణ, సేవలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఓ డాక్టర్‌రాజా రెడ్డి మాట్లాడుతూ సిబ్బంది క్రమశిక్షణతో పాటు సేవాభావంతో పనిచేయాలని సూచించారు. ఐసిటిసి సిబ్బంది మరింత చురుకుగా పనిచేసి హెచ్ఐవి స్క్రీనింగ్ శాతాన్ని పెంచాలని ఆదేశించారు. క్షయ వ్యాధి (టిబి) ఉన్న ప్రతి వ్యక్తికి హెచ్ఐవి స్క్రీనింగ్ నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే వరంగల్ జిల్లాకు చెందిన హెచ్ఐవి కేసులు ఇతర ప్రాంతాల్లో నమోదు కాకుండా, కేసులను గుర్తించి సంబంధిత జిల్లాలోనే నమోదు చేసి, అవసరమైన వైద్య సేవలు అందేలా సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఎన్‌జిఓలు ప్రజల్లో హెచ్ఐవి/ఎయిడ్స్ పై అవగాహన కల్పించేందుకు విస్తృతంగా ఐఇసి కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. హెచ్ఐవి జీవిస్తున్న వ్యక్తుల పట్ల వివక్ష లేకుండా, వారికి అవసరమైన వైద్య, మానసిక, సామాజిక సహకారం అందేలా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో హనుమకొండ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ మదన్ మోహన్ రావు, డిపిఎం స్వప్న మాధురి, డేటా మేనేజర్ కమలాకర్, డిప్యూటీ డెమో ఎస్.వెంకటేశ్వర్లు వివిధ ఎన్‌జిఓల ప్రతినిధులు, ఐసిటిసి సిబ్బంది, ఎఆర్‌టి సిబ్బంది, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## చోళ గోల్డ్ లోన్ నూతన బ్రాంచ్ ప్రారంభం




**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** వరంగల్ నగరంలోని అండర్ బ్రిడ్జి, శివనగర్ ఎస్‌బిఐ బ్యాంక్ సమీపంలో చోళ గోల్డ్ లోన్ సంస్థ నూతన బ్రాంచ్‌ను ఘనంగా ప్రారంభించారు. సంస్థ రీజినల్ మేనేజర్ దుంబాల వెంకటరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై నూతన బ్రాంచ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సిబ్బంది, నిర్వాహకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రీజినల్ మేనేజర్ దుంబాల వెంకటరెడ్డి మాట్లాడుతూ వరంగల్ నగర ప్రజలకు మరింత చేరువగా గోల్డ్ లోన్ సేవలను అందించాలనే ఉద్దేశ్యంతో నూతన బ్రాంచ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బంగారంపై రుణం పొందాలనుకునే ఖాతాదారులకు సులభమైన విధానంలో తక్కువ వడ్డీతో గోల్డ్ లోన్ అందించేందుకు సంస్థ కృషి చేస్తుందన్నారు. అత్యవసర అవసరాలు ఉన్న ప్రజలు తమ బంగారాన్ని సద్వినియోగం చేసుకొని అవసరమైన రుణాన్ని పొందవచ్చని పేర్కొన్నారు. బంగారు అభరణాల భద్రతకు సంస్థలో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, ఖాతాదారుల నమ్మకానికి అనుగుణంగా సేవలు అందించడమే సంస్థ ప్రధాన లక్ష్యమని వెంకటరెడ్డి తెలిపారు. పారదర్శకమైన విధానంలో రుణ సేవలు అందించడంతోపాటు, ఖాతాదారులకు అవసరమైన సమాచారం, మార్గదర్శకత్వం అందిస్తామని చెప్పారు. వరంగల్ నగర ప్రజలు నూతన బ్రాంచ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఏఆర్‌బిఎం సామల రవీందర్, బ్రాంచ్ మేనేజర్ అనుమాండ్ల తిరుపతి, కార్యాలయ సిబ్బంది వినోద్, దిలీప్‌తో పాటు పలువురు సిబ్బంది, ఖాతాదారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

**ప్రజాపక్షం/ములుగు:** ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 27వ తేదీన జిల్లాలలో వివిధ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర పర్యాటక, సంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్ అన్నారు. బుధవారం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఇతర శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని వీడియో సమావేశ మందిరం నుండి జిల్లా కలెక్టర్ బోర్డే హేమంత్ సహదేవరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ జిల్లాలలో పర్యాటక రంగ అభివృద్ధికి జిల్లా స్థాయిలో నోడల్ అధికారులను నియమించి, వివిధ శాఖల సమన్వయంతో పర్యాటక ప్రదేశాలను అభివృద్ధి చేయాలని తెలిపారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం కేటాయించిన నిధులను సద్వినియోగం చేసుకొని ఆకర్షణీయమైన కార్యక్రమాలను నిర్వహించాలని తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జిల్లాలోని పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని, పర్యాటక ప్రాంతాలను ప్రజలందరికీ తెలిసే విధంగా విస్తృత ప్రచారం నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్‌రావు, జిల్లా టూరిజం నోడల్ ఆఫీసర్ డాక్టర్ ధర్మనాయక్, డిఈఓ సిద్ధార్థ రెడ్డి, డిఐఓ వీరేందర్ డిపిఆర్ఓ రఫిక్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జిల్లా స్థాయి సైన్స్ డ్రామా పోటీలు

**ప్రజాపక్షం/మహబూబాబాద్:** మహబూబాబాద్ మోడల్ స్కూల్‌లో బుధవారం జిల్లా స్థాయి సైన్స్ డ్రామా పోటీలు ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఇన్‌చార్జి జిల్లా విద్యాశాఖ అధికారి మందుల శ్రీరాములు ప్రారంభించారు. జిల్లా సైన్స్ అధికారి అప్పారావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన మొత్తం 10 సైన్స్ డ్రామా బృందాలు పాల్గొన్నాయి. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా, చురుకుగా పాల్గొని, తమకు కేటాయించిన పాత్రలను అద్భుతంగా పోషించారు. తమ నటన ద్వారా శాస్త్రీయ అంశాలను, సమాజానికి , పర్యావరణానికి సంబంధించిన ముఖ్యమైన సందేశాలను ప్రేక్షకులకు అందించారు.పోటీలలో ప్రధానంగా క్రింది అంశాలపై డ్రామాలను ప్రదర్శించారు:1. సముద్రాల పునరుద్ధరణ – భవిష్యత్ తరాల పరిరక్షణ)2. కృత్రిమ మేధస్సు – మానవుల చేతుల్లో)3, ఎలక్ట్రిక్ వాహనాలు – భవిష్యత్ మార్గం) విద్యార్థుల సృజనాత్మకత, శాస్త్రీయ ఆలోచనా విధానం, నటనా ప్రతిభను అధికారులు అభినందించారు. ఇలాంటి పోటీలు విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, సృజనాత్మకత,



ఆత్మవిశ్వాసం ,సామాజిక బాధ్యతను పెంపొందించడానికి దోహదపడతాయని తెలిపారు.జిల్లా స్థాయిలో ప్రథమ స్థానాన్ని శ్రీ వివేకావర్ధిని ఉన్నత పాఠశాల కేసముద్రం సాధించింది. ఈ బృందం మహబూబాబాద్ జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తూ రాష్ట్ర స్థాయి సైన్స్ డ్రామా పోటీలలో పాల్గొననుంది. ద్వితీయ స్థానం టిజిఎంఎస్ చిలుకోడు విద్యార్థులు, తృతీయ స్థానం జెడ్‌పిహెచ్ఎస్ శనిగపురం విద్యార్థులు పొందినారు.ప్రథమ స్థానం సాధించిన బృందానికి ఇన్‌చార్జి డిఇఓ అభినందనలు తెలియజేసి, రాష్ట్ర స్థాయి పోటీలలో కూడా ప్రతిభ కనబరిచి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## ఘనంగా తెలంగాణ భాషా దినోత్సవ వేడుకలు

**ప్రజాపక్షం/గూడూరు;** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలురలో శ్రీ కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకుని తెలంగాణ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు పెండెం హరిశంకర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కాళోజీ సాహిత్య సేవలను తెలంగాణ యాస భాషా గొప్పతనాన్ని గుర్తుచేశారు.ఈసందర్భంగా ఇన్‌చార్జి హెచ్ఎం మాట్లాడుతూ కాళోజీ రచనలు తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తినిచ్చాయని పేర్కొన్నారు.పుట్టుక నీది చావు నీది బ్రతుకంతా ఈదేశానిది వంటి ఆయన రచనలను గుర్తుచేశారు.ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు సునీత శరత్‌బాబు శ్రీనువాస్ శ్రీధర్ రాజు వెంటేశ్వర్లు అనిల్‌కుమార్ యాకలక్ష్మీ సులోచన సంధ్యారాణి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## జనగామ ఎమ్మెల్యే పల్లా సస్పెన్షన్ సరియైంది కాదు: ధర్మపురి

**ప్రజాపక్షం /జనగామ రూరల్ :** జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సస్పెన్షన్ సరియైంది కాదని బిఆర్‌ఎస్ సీనియర్ నాయకులు, మాజీ కౌన్సిలర్ ధర్మపురి శ్రీనివాస్ అన్నారు. నిత్యం ప్రజా సమస్యల పరిష్కారం కోసం పనిచేసే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అసెంబ్లీ లోనూ అనేక సమస్యల్ని ప్రస్తావించేవారన్నారు. ఎమ్మెల్యేలుగా, ప్రతిపక్ష పార్టీ నాయకులు ప్రజా సమస్యల్ని అసెంబ్లీలో లేవనెత్తే హక్కు ఉందన్నారు. వారి హక్కును హరిస్తున్న కాంగ్రెస్ ఏకపక్షంగా బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను సస్పెన్షన్ చేసిందన్నారు. దీని వలన ప్రతిపక్షాల గొంతు నొక్కినట్లుగా ప్రజలు భావించాల్సి వస్తుందన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజాప్రతినిధుల హక్కుల్ని కాలరాయకుండా వారికి మాట్లాడే స్వేచ్ఛ, హక్కు ఇవ్వాలన్నారు. అసెంబ్లీకి రాకుండా సస్పెన్షన్ చేస్తే ప్రజల సమస్యలను అడిగే అవకాశం లేకుండా పోతుందన్నారు. ప్రభుత్వం ప్రజాప్రతినిధుల నొక్కకుండా ఉండాలన్నారు.

## హమార ప్రసాదన్‌ను వెంటనే అరెస్ట్ చేయాలి

**ప్రజాపక్షం /జనగామ :** డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కల్పిత నాయకుడు అంటు హమార ప్రసాద్ ఒక్క పుస్తకాన్ని వ్రాసి దానిని విడుదల చేస్తానని సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారని వెంటనే ఆయనను అరెస్ట్ చేయాలని కరెన్సీ నోటుపై అంబేద్కర్ పోటో సాధన సమితి జాతీయ అధ్యక్షులు జేరిపోతుల కుమార్ కోరారు. బుధవారం జనగామ డిసిపి రాజమహేంద్రనాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో కూడా హమార ప్రసాద్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌ను గతంలోనూ విమర్శించాడన్నారు. ఆయనను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కరెన్సీపై అంబేద్కర్ పోటో సాధన సమితి జాతీయ సలహాదారులు మల్లిగారి రాజు, నాయకులు మచ్చ కుమార్, కనుకరాజు, మౌనిక, పి రేవంత్ పాల్గొన్నారు.

## శ్రీసోమేశ్వర స్వామికి వెండి నాగ ప్రతిమ సమర్పించిన భక్తులు

**ప్రజాపక్షం/పాలకుర్తి:** మండల కేంద్రంలోని ప్రముఖ ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రమైన కోరిన కోర్కెలు తీర్చే స్వయంభు శ్రీచండికా సమిత సోమేశ్వర స్వామి వారికి 14 తులాల (రూ.38వేల) విలువగల వెండి నాగ ప్రతిమను జిల్లా ఆర్యవైశ్య మహాసభ జిల్లా నాయకులు, జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ గౌరవ సభ్యులు, ఆరూరి రవి భార్గవి దంపతులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి లక్ష్మి ప్రసన్న, అర్చకులు అనిల్ శర్మ, రమేష్ శర్మ, నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి

**ప్రజాపక్షం/తరిగొప్పుల:** విద్యార్థుల స్కాలర్‌షిప్, ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని బీజేపి నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు మండల అధ్యక్షుడు ఆవుల శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో బుధవారం తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం వెంటనే బకాయిలను చెల్లించాలని కోరారు. కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు రాంనర్సింహారెడ్డి, నాయకులు రాంబ్రహ్మాచారి, రాజు, వెంకటేష్ గౌడ్, రాజు యాదవ్, శ్రీకాంత్ నాయక్, అనిల్ నాయక్, సుమన్ నాయక్, రాజు గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన ప్రణవ్

**ప్రజాపక్షం/కమలాపూర్:** కమలాపూర్ మండలం అంబాల గ్రామ మాజీ సర్పంచ్ కెత్త రవి తండ్రి ఇటీవల అనారోగ్య కారణంతో మరణించగా వారి నివాసానికి వెళ్ళి చిత్రపటానికి హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ వొడితల ప్రణవ్ పూలమాల వేసి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో ప్రణవ్ తో పాటు కమాలాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ తవుటం ఝాన్సీ రాణి రవీందర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, భీంపల్లి సర్పంచ్ వాసాల శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు బాలస్వామి రమేష్ గౌడ్, జిల్లా కాంగ్రెస్ కమిటి జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్ల రమేష్, కమలాపూర్ ఉప సర్పంచ్ పుల్ల శ్రీనివాస్, నియోజకవర్గ నాయకులు బిక్షపతి, జిల్లా నాయకులు నాంపల్లి ప్రభాకర్, చందు, రమేష్, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

## కళాకారులను ప్రోత్సహించాలి

### మాజీ సర్పంచ్ విజయ అశోక్‌రెడ్డి



**ప్రజాపక్షం/గణపురం:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం లక్ష్మారెడ్డిపల్లి గ్రామంలో కీర్తిశేషులు ఒద్దుల లక్ష్మి, పెద్ద రాజిరెడ్డిల జ్ఞాపకార్థం డప్పు కళాకారులకు డప్పుల వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ మాజీ సర్పంచ్ ఒద్దుల విజయ అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో డప్పు కళాకారులకు మొత్తం 12 డప్పులను అందజేశారు. ఈ సందర్భంగా విజయ అశోక్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో డప్పు కళాకారులు తమ కళను నమ్ముకుని సంప్రదాయాలను కాపాడటంతో పాటు ప్రజల్లో చైతన్యం తీసుకురావడంలో కీలకపాత్ర పోషిస్తున్నారని అన్నారు. కళాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో కీర్తిశేషుల జ్ఞాపకార్థం డప్పులను అందజేసినట్లు తెలిపారు. కళాకారులకు అవసరమైన సహకారం అందించడం ద్వారా డప్పు కళ, సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సర్పంచ్ వీరమల్ల సంపత్‌రెడ్డి, వార్డు సభ్యులు జన్ను శరత్, మామిడాల విజయ్, డప్పు కళాకారులు మొగిలి, సది, పోషాలు, ఐలయ్య, బండారి సారయ్య, తదితరులు పాల్గొన్నారు.

## బచ్చన్నపేటలో కాంగ్రెస్ గ్రామ కమిటీల ప్రకటన

**ప్రజాపక్షం/బచ్చన్నపేట:** కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా చేపట్టిన సంఘటన సృజన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని పలు గ్రామాలకు నూతన కాంగ్రెస్ పార్టీ కమిటీలను అధికారికంగా ప్రకటించారు. నియోజకవర్గ ఇంచార్జి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, డీసీసీ అద్యక్షురాలు లకావత్ ధన్వంతి ఆదేశాల మేరకు, మండల పరిశీలకుడు లింగాల జగదీష్ చందర్ రెడ్డి పర్యవేఓనలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మహ్మద్ మసూద్ నూతన కమిటీల జాబితాను విడుదల చేశారు. అనంతరం మసూద్ మాట్లాడుతూ కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు కాంగ్రెస్ పార్టీలో సముచిత స్థానం, గుర్తింపు లభిస్తాయన్నారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన గ్రామ కమిటీ అధ్యక్షులు, కార్యదర్శులు, సభ్యులకు, నాయకులు శుభాకాంక్షలు తెలుపుతూ, పార్టీ బలోపేతానికి పునరంకితం కావాలన్నారు.

## ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణ కోసం ఉద్యమం

### ఆర్టీసీ ఎస్డబ్ల్యుఎఫ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వీరాంజనేయులు




**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోసం, సామాజిక ప్రయోజనాల కోసం, ఉద్యోగ భద్రత కోసం, కార్మికుల హక్కుల కోసం పోరాడాల్సిన సమయం ఆసన్నమైందని ఆర్టీసీ ఎస్డబ్ల్యుఎఫ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వీరాంజనేయులు పిలుపునిచ్చారు. బుధవారం టీ ఉప్పలయ్య అధ్యక్షతన రాంనగర్ లోని సిఐటియు కార్యాలయంలో ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణ జిల్లా సదస్సు జరిగింది.ఈ సదస్సుకి ముఖ్యఅతిథిగా హాజరైన వీరాంజనేయులు మాట్లాడుతూ వ్యూహాత్మక రంగాల్లో కూడా ప్రభుత్వరంగం నామమాత్రంగా ఉంటే చాలునని మోడీ ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిందని ఇప్పుడున్న సంస్థలన్నింటినీ సాధ్యమైనంత తొందరగా పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా ప్రైవేటీకరించడం, టోకుగా అమ్మివేయడం లేదా మూసివేయడానికి రంగం సిద్ధం చేసిందని ఆయన, అన్నారు. పెట్టుబడుల ఉపసంహరణ వేగంగా జరిగిపోతున్నది. ఇందుకు కంపెనీ ఉన్నతాధికారులు సహకరించకపోతే, ఎండితో సహా తొలగిస్తామని కూడా బిజెపి నాయకత్వంలోని యూనియన్ ప్రభుత్వం రాతపూర్వకంగా హెచ్చరించిందని, ప్రభుత్వరంగ సంస్థలు ఆధునిక దేవాలయాలన్నారు మొదటి ప్రధానమంత్రి జవహర్లాల్ నెహ్రూ ఇప్పుడు ప్రధాని మోదీ మాత్రం ప్రభుత్వరంగ సంస్థలను నామరూపాల్లేకుండా చేస్తున్నారని,ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థలను బలహీనం చేసి కొన్నింటిని మూసివేసి కార్మికుల సంఖ్య తగ్గించారని అన్నారు.. బిజెపి ప్రభుత్వం కార్మికుల మీద నాలుగు లేబర్ కోడ్స్ రుద్దుతున్నారని ప్రభుత్వరంగ సంస్థల యాజమాన్యాలు ఆదర్శ యాజమాన్యాలుగా పని చేయాలన్నా నాటి ప్రధాని జవహర్లాల్ నెహ్రూ. కానీ నేటి ప్రధాని మోడీ మాత్రం ప్రైవేట్ సంస్థలతో పోటీ పడాలంటున్నారని తీవ్రంగా విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోసం ఐక్యంగా ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ మాట్లాడారు. వాటి రక్షణ కోసం ఐక్య ఉద్యమాలు చేయాలని రమేష్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి బొట్లచక్రపాణి జిల్లా నాయకులు బియు చారి, టి.ఎల్లయ్య, రమణ,సంపత్, మహేందర్, ఎండి సాజిద్,యాదగిరి, మోహన్, లతోపాటు ఉద్యోగులు పాల్గొన్నారు

## ప్రభుత్వ ఆసుపత్రిలో మౌలిక వసతులకు చర్యలు చేపట్టాలి

### జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** ప్రధాన ఆసుపత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంతో పాటు, అవసరమైన మౌలిక వసతులను మెరుగుపరచేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ వైద్యులను ఆదేశించారు. బుధవారం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా సందర్శించిన కలెక్టర్ వివిధ విభాగాలను, ఆసుపత్రి మౌలిక వసతులను పరిశీలించారు. క్యాజువాలిటీ, ఎంఆర్ఐ, ల్యాబ్, రిజిస్ట్రేషన్, క్రిటికల్ కేర్ యూనిట్, డయాలసిస్ యూనిట్ల ఏర్పాటును పరిశీలించారు. ఆసుపత్రి ఆవరణలో డంప్ యార్డ్ నిర్మాణానికి ప్రతిపాదించిన స్థలం, డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులను తనిఖీ చేసి నాణ్యత పాటించాలని సూచించారు. ప్రస్తుతం ఉన్న 140 పడకల సామర్థ్యాన్ని 230 పడకలకు పెంచేందుకు అవసరమైన భవనాలు, వైద్య పరికరాలు, సిబ్బంది తదితర వనరులపై సమగ్ర నివేదిక సమర్పించాలని ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. ఓపీ రిజిస్ట్రేషన్ కేంద్రం వద్ద రోగులు ఇబ్బంది పడకుండా క్యూ లైన్లలో కూర్చునేలా షెడ్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. పార్కింగ్, తాగునీరు, మరుగుదొడ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు. రోగులు, వారి సహాయకుల వాహనాల కోసం ప్రధాన గేటు ఎడమ వైపున పార్కింగ్ సదుపాయం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆసుపత్రిలో అదనంగా మరో ఆర్.ఓ. ప్లాంట్ ఏర్పాటు చేయడంతో పాటు, అదనపు మరుగుదొడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. వైద్య పరికరాల టెండర్ ప్రక్రియ, అంబులెన్స్‌ల మరమ్మతులు, నిరంతర విద్యుత్, తాగునీటి సరఫరా, పారిశుద్య సిబ్బంది నియామకం తదితర అంశాలను సమీక్షించి, పెండింగ్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్ చాంబర్‌లో వైద్యులతో సమీక్షా సమావేశం నిర్వహించిన కలెక్టర్, ఆసుపత్రి నిర్వహణకు సంబంధించిన 20 ప్రధాన అంశాలపై సమగ్రంగా చర్చించారు. అందుబాటులో ఉన్న వనరులను సమర్థవంతంగా వినియోగించుకుంటూ, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందేలా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ వసంతకుమారి,ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకట రత్నం, మున్సిపల్ కమిషనర్ ఉదయ్ కుమార్, ఎన్‌పీడీసీఎల్ డీఈ పాపిరెడ్డి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ దివ్య, అసిస్టెంట్ డైరెక్టర్ యాదగిరి, ఆర్ఎంఓ డాక్టర్ రాజేష్, టీజీఎంఐడీసీ అధికారులు, వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల ఇబ్బందులు పట్టించుకోని ప్రజా ప్రభుత్వం ఇదేనా



**ప్రజాపక్షం/మంగపేట :** మంగపేట మండలం మల్లూరు గ్రామం నుంచి నర్సింహసాగర్ వెళ్లే ప్రధాన రహదారిలో కోట్లబోరు సప్తా నుంచి గ్రామ శివారు వరకు చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణాన్ని అసంపూర్తిగా చేసి సుమారు రెండు నెలలుగా అలాగే వదిలేయడంతో పరిసర గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బిఆర్ఎస్ పార్టీ ములుగు జిల్లా సీనియర్ నాయకులు కుడుముల లక్ష్మీ నారాయణ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క శాఖ పరిధిలోనే ఈ రోడ్డు నిర్మాణం జరుగుతున్నప్పటికీ, రెండు నెలలుగా పనులు నిలిచిపోవడం మంత్రి సీతక్క దృష్టికి రాలేదా అని ప్రశ్నించారు. మల్లూరు నర్సింహసాగర్ ప్రధాన రహదారిపై సీసీ రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయకుండా మధ్యలోనే వదిలేయడం వల్ల ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. రహదారి మొత్తం వెడల్పును పూర్తి చేయకుండా ఒక వైపు మాత్రమే నిర్మాణం చేపట్టి వదిలేయడంతో లారీలు, బస్సులు వంటి పెద్ద వాహనాలు వెళ్లే సమయంలో ద్విచక్ర వాహనదారులు సైతం రాకపోకలు సాగించలేని పరిస్థితి ఏర్పడింది. రోడ్డు నిర్మాణం ఎర్జి కారణంగా మోటార్ సైకిళ్లను పక్కకు దించుకోవడానికి కూడా అవకాశం లేకుండా పోయింది. ఈ ప్రధాన రహదారిపై రాకపోకలు సాగించే శనగకుంట, గొందిగూడెం మొట్లగూడెం పూ రేడిపల్లి నరేంద్రరావుపేట మల్లూరు నర్సింహసాగర్ తదితర గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా నర్సింహసాగర్ గ్రామానికి వెళ్లే బస్సు సైతం రహదారి పరిస్థితి కారణంగా మల్లూరు నుంచి వెనక్కి తిరిగి వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల మాజీ ప్రధాన కార్యదర్శి గుండేటి రాజుయాదవ్, మల్లూరు దేవస్థాన మాజీ చైర్మన్ నూతిలకంటి ముకుందం, పార్టీ నాయకులు, కోరెం నర్సింహులు,చిన్నల చక్రధర్, పూజారి శ్రీనివాస్, అరెల్లి దేవేందర్, చల్లగురుగుల తిరుపతి, భూట్టో, రావుల రమణ, నాలి కాంతారావు, పంజాల సత్యం, నాలి బుచ్చయ్య, సోషల్ మీడియా వారియర్స్ బీసా సాంబయ్య, గుడివాడ శ్రీహరి,గౌరి శంకర్, తదితరులు పాల్గొన్నారు.

## కుళాయి నీటికి గేటు వాల్ అమర్చండి

**ప్రజాపక్షం/కమలాపూర్:** త్రాగునీటికి, ఇతర అవసరాలకు ఉపయోగించుకునే నల్ల నీటిని వినియోగించుకునే గ్రామస్థులు నీటిని పొదుపుగా వాడుకోవడం వల్ల నీటి ఎద్దడిని పూర్తిగా అరికట్టవచ్చని కమలాపూర్ మేజర్ గ్రామపంచాయతి సర్పంచ్ పబ్బు సతీష్ గ్రామస్థులకు విజ్ఞప్తి చేశారు. ఈ సంవత్సరంలో వర్షాభావం తక్కువగా ఉండడం వంటి కారణాల వల్ల రానున్న రోజులలో నీటి సమస్యలను ఎదుర్కొవాల్సిన పరిస్థితి ప్రజలకు ఏర్పడుతుందని, అలాంటి తరుణంలో కొంత మంది నీటి వినియోగదారులు నల్ల నీటిని వృధాగా వదలడం వల్ల మరికొంతమందికి సరైన నీరు అందక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న రోజులలో నల్ల నీటి కోసం మరింత ఇబ్బందులు పడే అవకాశం ఉందని, ఇప్పటికైనా ప్రజలు నల్లని వాడుకునే ప్రతి ఒక్కరు నీటి వృధా చేయవద్దని సర్పంచ్ కోరుతున్నారు. గ్రామ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పాలకవర్గం పనిచేసేందుకు సిద్ధంగా ఉందన్నారు. గ్రామప్రజల సహకారంతోనే గ్రామాన్ని అభివృద్ధి చేస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## గణపురంలో శ్రావణమాస బోనాల సందడి

**ప్రజాపక్షం/గణపురం:** శ్రావణమాస ఉత్సవాల్లో భాగంగా గణపురం మండల కేంద్రంలో పోచమ్మతల్లికి భక్తిశ్రద్ధలతో బుధవారం బోనాలను సమర్పించారు. మొదట భక్తులు గ్రామ దేవతల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బోనాలను నెత్తిన పెట్టుకొని డప్పు చప్పుళ్లతో ఊరేగింపుగా పోచమ్మ తల్లి ఆలయానికి చేరుకొని ప్రదక్షిణల అనంతరం నైవేద్యాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామంలో ఎలాంటి వ్యాధులు ప్రబలకుండా కుటుంబాలు చల్లగా ఉండాలని పాడిపంటలు సమృద్ధిగా పండాలని పోచమ్మతల్లిని భక్తులు వేడుకున్నారు.

## సాయుధ పోరాట ఉత్సవాలు జయప్రదం చేయండి

**ప్రజాపక్షం/బచ్చన్నపేట:** సెప్టెంబర్ 10వ తేదీ నుండి 17వరకు జరిగే తెలంగాణ సాయుధ పోరాట ఉత్సవాలను జయప్రదం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి బెల్లంకొండ వెంకటేష్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో రావుల రవీందర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో వెంకటేష్ మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట ఉత్సవాల కార్యక్రమంలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మండల కమిటి సభ్యులు బలరాములు, నరసింహులు, ఎల్లయ్య, లక్ష్మి, కల్పన, శాఖ కార్యదర్శి ఉప్పల గాలయ్య, సులోచన, యాదగిరి, అశోక్ పాల్గొన్నారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుల చేయాలి

**ప్రజాపక్షం/బచ్చన్నపేట:** పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేసి విద్యార్థులను ఆదుకోవాలని బీజేపి మండల అధ్యక్షులు బంగారు మహేష్ డిమాండ్ చేశారు. బీజేపి మండల శాఖ ఆధ్వర్యంలో మహేష్ నాయకత్వంలో స్థానిక తహశిల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రూ.15వేల కోట్ల మేర స్కాలర్‌షిప్ ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకుండా రాష్ట్ర ప్రభుత్వం 40 లక్షల మంది విద్యార్థులు జీవితాలతో చెలగాటమాడుతుందని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే స్కాలర్‌షిప్స్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు సద్ది సోమిరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి గద్ద రాజు, సీనియన నాయకుడు చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా గిరిజన సర్పంచ్‌ల ఫోరం ఉపాధ్యక్షుడిగా అలుపతి నాయక్

**ప్రజాపక్షం/తరిగొప్పుల:** గిరిజన సర్పంచ్‌ల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు డా. భూక్య సంతోష్ నాయక్ చేతుల మీదుగా జిల్లా గిరిజన సర్పంచ్ ఫోరం జిల్లా ఉపాధ్యక్షులుగా జాల్ బాయ్ తండా సర్పంచ్ అలుపతి నాయక్‌ను ఏకగ్రీవంగా నియమించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోయే రోజులలో గిరిజనులకు చెందిన సమాన వాటాను పూర్తిగా దక్కాలని తన వంతు బాధ్యతగా నెరవేరుస్తానని, గిరిజన హక్కుల కోసం పోరాడుతానన్నారు. తనకు అవకాశం ఇచ్చిన రాష్ట్ర నాయకత్వానికి, గిరిజనులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# దళితులు నడిచారని రోడ్లను పసుపు నీళ్లతో కడగడం సిగ్గుచేటు

ప్రజాపక్షం/గజ్వేల్ : ఎర్రవల్లి సమీప గ్రామాలలో దళితులు డప్పు చప్పుళ్లతో నడిచారని బిఆర్ఎస్ నేతలు పసుపు నీళ్లతో రోడ్లు శుభ్రం చేయడం సిగ్గుచేటు కాగా, కెసిఆర్ దొర అహంకారాన్ని ఒంట బట్టించుకున్న ఆ పార్టీ నేతల వైఖరి ఈ సంఘటనతో బహిర్గతమైందని గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్ విమర్శించారు. బుధవారం గజ్వేల్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ను బిఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ అసెంబ్లీ సాక్షిగా దూర్భాషలాడగా, అదే దారిలో వెళ్తున్న ఆ పార్టీ నేతలు అంటరానితనం, అస్పృశ్యత, కుల వివక్షత ప్రదర్శిస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. డాక్టర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని బిఆర్ఎస్ నేతలు విస్మరించి కెసిఆర్ ఫ్యూడలిజాన్ని తెరపైకి తెస్తుండగా, ఈ చర్య సమాజ శ్రేయస్సుకు ఎంత మాత్రం శ్రేయస్కరం కాదని నిలదీశారు. యుగాలు, తరాలు మారినా గ్రామాల్లో కుల వివక్షత కొనసాగడం దురదృష్టకరమని, సామాజిక ప్రజాస్వామ్యంతోనే దళితులకు నిజమైన స్వాతంత్ర్యం వస్తుందని అన్నారు. దళిత సమాజాన్ని కించపరిచే విధంగా వ్యవహరించిన బిఆర్ఎస్ నేతలను పార్టీ నుండి బహిష్కరించాలని, లేనిపక్షంలో కెసిఆర్ దళిత వ్యతిరేక వ్యక్తిగా చరిత్రలో నిలుస్తారని చెప్పారు. రోడ్లపై దళితులు నడిచారని పసుపు నీళ్లు చల్లి ఆ దుశ్చర్యకు పాల్పడిన నేతలు క్షమాపణ చెప్పని పక్షంలో దళిత సమాజాన్ని చైతన్యం చేసి తగిన గుణపాఠం చెప్తామని వివరించారు.

# జ్ఞానభారత్ మిషన్ కార్యక్రమానికి సహకరించాలి

-జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మి కిరణ్



ప్రజాపక్షం/ సిద్దిపేట : భారతదేశంలోని ప్రాచీన, అరుదైన తాళపత్రాలు, చేతిరాత ప్రతులు, పాండులిపులు మరియు ఇతర సాంప్రదాయ జ్ఞాన వనరులను సంరక్షించడం, డిజిటలైజ్ చేయడం మరియు ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం లక్ష్యంగా జ్ఞాన భారత్ మిషన్ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మి కిరణ్ తెలిపారు. జిల్లాలోని ప్రజల వద్ద నుండి ఇలాంటివి వాటిని సేకరించి డిజిటలైజేషన్ చేసి మళ్లీ తిరిగి ఇవ్వడం జరుగుతుందని ఎవరి వద్దనైనా ఉంటే కలెక్టర్ కార్యాలయంలోని అదనపు కలెక్టర్ రెవెన్యూ కార్యాలయంలో అందజేయాలని జిల్లా అదనపకలెక్టర్ రెవెన్యూ లక్ష్మీ కిరణ్ ఒక ప్రకటన తెలిపారు. జ్ఞాన భారత్ మిషన్ అనేది భారతదేశంలోని ప్రాచీన, అరుదైన మరియు విలువైన మాన్యుస్క్రిప్టులు (తాళపత్రాలు, చేతిరాత ప్రతులు, పాండులిపులు) మరియు ఇతర సాంప్రదాయ జ్ఞాన వనరులను సంరక్షించడం, డిజిటలైజ్ చేయడం మరియు ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం లక్ష్యంగా భారత ప్రభుత్వం చేపట్టిన జాతీయ స్థాయి కార్యక్రమమని, భారతదేశంలో వేల సంవత్సరాలుగా వివిధ భాషలు, లిపులు మరియు ప్రాంతాల్లో భద్రపరచబడిన గ్రంథాలలో చరిత్ర, సాహిత్యం, వైద్యం, విజ్ఞానం, ఖగోళశాస్త్రం, తత్వశాస్త్రం, కళలు, సంస్కృతి మరియు సంప్రదాయ జ్ఞానం వంటి అనేక రంగాలకు సంబంధించిన అమూల్యమైన సమాచారం ఉంది.

**జ్ఞాన భారత్ మిషన్ యొక్క ప్రధాన లక్ష్యం:**

భారతదేశపు అమూల్యమైన మాన్యుస్క్రిప్ట్ వారసత్వాన్ని "సంరక్షణ – డిజిటలైజేషన్ – ప్రాప్యత – పరిశోధన" అనే విధానంతో భద్రపరచి, భారతీయ సంప్రదాయ జ్ఞానాన్ని దేశీయంగా మరియు ప్రపంచవ్యాప్తంగా అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుందని జిల్లాలో ఎవరి వద్దనైనా ఇలాంటి అమూల్యమైన ప్రాచీన సంపద ఉంటే కలెక్టర్ కార్యాలయంలోని అతను కలెక్టర్ రెవెన్యూ ఛాంబర్ లో అందించాలని ఆమె ఆ ప్రకటనలో తెలిపారు.

# సిఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దిష్టిబొమ్మ దగ్ధం

ప్రజాపక్షం/ సిద్దిపేట : బిఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై ఎమ్మెల్యే వీర్లాపల్లి శంకర్ అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ చిన్నకోడూర్ మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టి సిఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ల దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండల కేంద్రంలో బిఆర్ఎస్ శ్రేణులు నిరసన ప్రదర్శించి దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటి మాజీ చైర్మన్ కాముని శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో, రాష్ట్ర అభివృద్ధిలో మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు.



**వీర్లపల్లి శంకర్ క్షమాపణ చెప్పాలి**

కెసిఆర్‌పై చేసినట్లు పేర్కొంటున్న అనుచిత వ్యాఖ్యలను ఎమ్మెల్యే వీర్లాపల్లి శంకర్ వెంటనే వెనక్కి తీసుకోవాలని బిఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. బహిరంగంగా క్షమాపణ చెప్పాలని కోరారు.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ వ్యవహారంపై స్పందించి ఇలాంటి వ్యాఖ్యలను ఖండించడంతో పాటు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాజకీయ విమర్శలు విధానాలు, ప్రజా సమస్యల చుట్టూనే ఉండాలని, వ్యక్తిగత విమర్శలు, అవమానకర వ్యాఖ్యలకు తావు ఇవ్వకూడదని వారు పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో అధికార పక్షంతో పాటు ప్రతిపక్షానికి కూడా సమానమైన గౌరవం, మాట్లాడే హక్కు ఉండాలని అన్నారు.

# మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డిని పరామర్శించిన ప్రభుత్వ సలహాదారు కేశవరావు

ప్రజాపక్షం/గజ్వేల్ : ఎర్రవల్లి డప్పుల మోత సంఘటనలో తీవ్రంగా గాయపడి నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డిని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కేశవరావు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు అందుతున్న వైద్య సేవలు, సంఘటనకు సంబంధించి డిసిసి అధ్యక్షులు తూంకుంట అంక్షారెడ్డిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, గండ్ర సత్యనారాయణ రావు, మాజీ మంత్రి పుష్పలీల, టిపిసిసి అధికార ప్రతినిధి సామ రామ్మోహన్ రెడ్డి తదితరులు మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డిని పరామర్శించి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

# అనాథ వృద్ధుడికి కుటుంబ సభ్యులుగా ఎండీర్ పౌండేషన్

ప్రజాపక్షం / పటాన్‌చెరు : ఇంద్రేశం మున్సిపల్ పరిధిలోని రోడ్డుపై అనాథగా జీవిస్తున్న ఓ వృద్ధుడు నాలుగు రోజుల క్రితం మృతి చెందిన విషయం స్థానికుల ద్వారా పోలీసుల దృష్టికి వచ్చింది పోలీసులు వెంటనే అతనిని చికిత్స నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి సంబంధించిన కుటుంబ సభ్యులు ,బంధువులు ఎవరూ లేక పోవడంతో పోలీసులు ఎండిఆర్ పౌండేషన్ ను సంప్రదించారు. అనాథలు నిరాశ్రయులైన వారికి అండగా నిలుస్తూ మానవతా దృక్పథంతో అంత్యక్రియలు నిర్వహిస్తున్న ఎండిఆర్ పౌండేషన్ ఈ వృద్ధుడిని కూడా తమ కుటుంబ సభ్యుడిగా భావించి ఈ రోజు గౌరవ ప్రదంగా అంత్యక్రియలు నిర్వహించింది. మనిషి చివరి ప్రయాణంలో కూడా మానవత్వమే తోడుగా నిలవాలి అనే సంకల్పానికి ఎండిఆర్ పౌండేషన్ మరోసారి నిదర్శనంగా నిలిచింది.

# భక్తులకు భోజనం అందించడం కోసమే అన్న ప్రసాద సదనము



ప్రజా పక్షం/కొండపాక : కొండపాక శివారులోని ఆనంద నిలయం ఆవరణలో కొలువైన ఉమా రామలింగేశ్వర సహిత అష్టాదశ శక్తి పీఠ దేవాలయానికి దర్శనం కోసం తెలుగు రాష్ట్రాల ప్రజలే కాక దేశం నుంచి వచ్చే భక్తుల కోసం ఆలయం ఆవరణలో అన్న ప్రసాద సదనమును ఏర్పాటు చేసినట్లు దేవాలయ చైర్మన్ రిటైర్డ్ ఐఏఎస్ రాష్ట్ర ప్రభుత్వ మాజీ సలహాదారుడు కె.వి రమణాచారి పేర్కొన్నారు. అష్టాదశ శక్తి పీఠం ఆవరణలో ఏర్పాటుచేసిన అన్నదాన అన్న ప్రసాద సదనాన్నికిమ్స్ ఆస్పత్రి చైర్మన్ బొల్లినేని కృష్ణయ్య తో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా కొండపాకలో అష్టాదశ శక్తిపీఠ దేవాలయం ఏర్పాటయిందని సుదూర ప్రాంతాల్లో ఉన్న అష్టాదశ శక్తి అమ్మవార్లను దర్శించే భాగ్యం లేని వారికి కొండపాక లో కొలువైన ఈ దేవాలయం భక్తుల అదృష్టమని పేర్కొన్నాడు. శక్తి పీఠాన్ని మరింత ప్రాబల్యంలోకి తీసుకురావడం కోసం మనందరం కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కిమ్స్ ఆస్పత్రి చైర్మన్ బొల్లినేని కృష్ణయ్య మాట్లాడుతూ, ఇతరులకు సేవ చేసే గుణం ఉన్నవారికి దైవం అండగా ఉంటుందని సేవ చేయడంలోనే సంతృప్తి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆనంద నిలయం చైర్ పర్సన్ లత, వికలాంగుల సేవ సంస్థ చైర్మన్ వంశీ రాధాకృష్ణ , కొండలరావు ట్రస్టు చైర్మన్ నాగరాజు, రిటైర్డ్ ఉప విద్యాధికారి పెద్ది వైకుంఠం, గ్రామ సర్పంచ్ మంచాల నవీన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిపక్షాలను సస్పెండ్ చేసి ఎవరితో చర్చలు జరుపుతారు?

ప్రజాపక్షం/ సిద్దిపేట : చావు అంచుల దగ్గరకు వెళ్లి తెలంగాణ సాధించిన కెసిఆర్ ఇంటికి చావు డప్పులతో వెళ్లి, తన చావును కోరుకునే కాంగ్రెస్ నాయకులు అసలు మనుషులేనా అని సిద్దిపేట మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రజా సమస్యలను చర్చించే అసెంబ్లీ నుంచి ప్రధాన ప్రతిపక్షాన్ని సస్పెండ్ చేసి చర్చలు ఎవరితో జరుపుతారని ప్రశ్నించారు. గత పది సంవత్సరాలలో బిఆర్ఎస్ ప్రభుత్వం అమలుపరిచిన పథకాలకు మంగళం పాడి....అమలు చేస్తామన్న ఆరు గ్యారెంటీలను కూడా అటకెక్కించిన ఘనత సీఎం రేవంత్ రెడ్డికి దక్కుతుందన్నారు..సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బిఆర్ఎస్ నాయకులు సోమిరెడ్డి,కనకయ్య, జువ్వన్న కనకరాజు, సాయిప్రేమ్ లతో కలిసి మీడియా తో మాట్లాడారు. అసెంబ్లీలో 6 గ్యారంటీలపై అడిగినందుకు తమ పార్టీ ఎమ్మెల్యేలను సస్పెండ్ చేయడం పిరికిపంద చర్య అన్నారు. అసెంబ్లీ గేటు వద్ద జరిగిన ఉద్రిక్తతలో ఆవేశంలో అన్న మాటలను పట్టుకుని సీఎం రేవంత్ రెడ్డి రాద్ధాంతం చేస్తున్నారని, ఇలాంటి దిక్కుమాలిన రాజకీయాలను తామెప్పుడూ చూడలేదని మండిపడ్డారు. కెసిఆర్ ఫామ్ హౌస్ పై దండయాత్ర అని ఒకరు, కెసిఆర్ చావు కోరుకుంటున్నామని మరొకరు ఇష్టారీతిగా వాగుతుంటే రేవంత్ రెడ్డి ఏం చేస్తున్నాడన్నారు. ఎమ్మెల్యేలను శాసనసభకు రాకుండా అడ్డుకోవడం, సస్పెండ్ చేయడం వంటి చర్యలు ప్రజాస్వామ్యాన్ని గొంతునొక్కడమే అని అభివర్ణించారు. కెసిఆర్ దళితులకు ఏం చేశారనేది ప్రజలందరికీ తెలుసునన్నారు. 1995లోనే దళిత చైతన్య జ్యోతి పథకాన్ని అమలుపరచిన ఘనత కేసిఆర్ కు ఉందని గుర్తు చేశారు.

# ఎర్రవల్లి ఫామ్ హౌస్ పరిసరాల్లో పసుపు నీళ్లతో శుద్ధి

ప్రజాపక్షం/జగదేవ్‌పూర్: మాజీ సిఎం కెసిఆర్ వ్యవసాయ క్షేత్రం పరిసర ప్రాంతాల్లో బిఆర్ఎస్ నాయకులు బుధవారం పసుపు నీళ్లతో శుద్ధి చేశారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై ఎమ్మెల్సీ అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా ఎస్సీ సెల్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం వెయ్యి డప్పులతో ఫామ్‌హౌస్ ముట్టడి చేపట్టిన నేపథ్యంలో అస్పృశ్యత నెలకొందన్న నేపంతో స్థానిక బిఆర్ఎస్ నాయకులు రోడ్లపై పసుపు నీళ్లు చల్లి శుద్ధి చేశారు. కాగా బిఆర్ఎస్ నాయకుల చేసిన ఈ కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారగా, బిఆర్ఎస్ పార్టీ దళిత వ్యతిరేకిగా ముద్రపడినట్లేందని రాజకీయ విశ్లేషకులు చర్చించుకుంటున్నారు. ఇప్పటికే దళిత స్పీకర్‌పై అనుచిత వాఖ్యలు చేసిన సంఘటన రాష్ట్ర వ్యాప్తంగా చంచలనం కాగా దానికి మరింత అజ్యాపోసినట్లుగా మళ్లి బిఆర్ఎస్ నాయకులు కెసిఆర్ వ్యవసాయ క్షేత్రం మహిళపడిందని ఈలాంటి పనులను చేయడం సభ్యసమాజానికి అవమానకరంగా మారింది.

# విద్యుత్ కోతలతో రైతులు తీవ్ర ఇబ్బందులు

ప్రజాపక్షం/జగదేవ్‌పూర్: మండలంలో అకస్మాత్తుగా విధిస్తున్న విద్యుత్ కోతలతో రైతులు, సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సిపిఐ జిల్లా నాయకులు బట్టు దయానందరెడ్డి పేర్కొన్నారు. బుధవారం తిగుల్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరులతో సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పుడు రోజుకు 10 గంటల పాటు కోత విధించటంతో వరి పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనధికారికంగా విద్యుత్ కోతలు విధించడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే విద్యుత్ అధికారులు స్పందించి కోతలు లేకుండా 24 గంటల నిరంతర కరెంటును అందించాలని ఆయన డిమాండ్ జేశారు. లేని పక్షంలో మండల వ్యాప్తంగా సిపిఐ ఆధ్వర్యంలో విద్యుత్ సబ్‌స్టేషన్ల ముందు ధర్నాలు చేపడుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి నరసింహారెడ్డి, గ్రామ కమిటీ కార్యదర్శి భిక్షపతి, కార్యవర్గ సభ్యులు ఎల్లారెడ్డి పాల్గొన్నారు.

# విద్యుత్ కోతలను నిరసిస్తూ బిఆర్ఎస్ ధర్నా

ప్రజాపక్షం/జగదేవ్‌పూర్: ఆకస్మాత్తుగా విధించిన విద్యుత్ కోతలకు నిరసనగా బుధవారం బిఆర్ఎస్ ఆధ్వర్యంలో రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం 24 గంటల కరెంటు సరఫరా చేయడంలేదంటూ మండల పరిధిలోని చాట్లపల్లి గ్రామంలో రహదారిపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా గంటపాటు కొనసాగడంతో రోడ్డుపై వాహనాలు భారీ సంఖ్యలో నిలిచిపోవడంతో ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

# స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటు

ప్రజాపక్షం/చేర్యాల : తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ తాతా మధును ఎమ్మెల్సీ పదవి నుంచి తొలగించాలని, స్పీకర్‌కు భేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు కొమురవెల్లి దేవస్థాన మాజీ చైర్మన్ ముత్యాల కిష్టయ్య. బుధవారం చేర్యాల మండల కేంద్రంలో దళిత బహుజన సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలుపుతూ, మాట్లాడుతూ, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, ఉద్యోగులపై కులం, మతం, ప్రాంతం పేరుతో అనుచిత, అసభ్యకర వ్యాఖ్యలు చేయడం ఏమాత్రం సహించబోమని హెచ్చరించారు. రాజ్యాంగం కల్పించిన హక్కులతో గ్రామస్థాయి నుంచి జాతీయస్థాయి వరకు వివిధ హోదాల్లో ఉన్న దళిత బహుజనసులను అవమానించే చర్యలను తీవ్రంగా వ్యతిరేకిస్తామని అన్నారు. ప్రజల ఓట్లతో గెలిచిన ప్రజాప్రతినిధులు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా, అనుచిత వ్యాకలు చేయడం, వికృత పదజాలంతో కించపరిచే సంస్కృతికి స్వస్తి పలకాలని డిమాండ్ చేశారు. దళిత బహుజనులు ఐక్యంగా ఉంటే అగ్రకుల ఆధిపత్య ధోరణులకు తావుండదని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దళిత బహుజన సంఘాల నాయకులు మాజీ కౌన్సిలర్‌లు పచ్చిమట్ల సతీష్, చెవిటి లింగం, ముత్యాల తార యాదగిరి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు నిమ్మ శ్రీనివాస్ రెడ్డి, జనగామ నియోజకవర్గం సోషల్ మీడియా కన్వీనర్ తాటికొండ సదానందం, చేర్యాల పట్టణ ప్రధాన కార్యదర్శి నీలం సన్ని, కొమ్మూరి యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు పోతరాజు తదితరులు పాల్గొన్నారు.

## దళిత సంఘాల రాస్తారోకో

**ప్రజాపక్షం / హత్నూర :** హత్నూర మండలంలోని (కాసాల) దౌల్తాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో దళిత సంఘాల నాయకుల ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ క్రమంలో దళిత సంఘాల నాయకులు మాట్లాడుతూ తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై బిఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాత మధు, నవీన్ కుమార్‌రెడ్డి లు నీచంగా సంస్కృతి హీనంగా మాట్లాడినందుకు వెంటనే బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు లను తాత మధు నవీన్‌రెడ్డిలను బర్తడే ఆఫ్ చేయాలని అన్నారు. రాజ్యాంగ బద్ధమైన స్పీకర్ పదవిని అనుమానించేలా మాట్లాడుతూ ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధం అని అన్నారు. రాజకీయంగా విభేదాలు ఉండవచ్చు అయితే వ్యక్తిగతంగా కుటుంబ సభ్యులకు ఉద్దేశించి ఫరుష వ్యాఖ్యలు చేయడం సరి కాదు అని స్పీకర్ గడ్డం ప్రసాద్ ధూషించడం చాలా బాదాకరం అని అన్నారు. తాత మదు నవీన్ కుమార్‌రెడ్డి వాఖ్యలను వెంటనే వెనకి తీసుకుని స్పీకర్ గడ్డం ప్రసాద్ కు క్షమాపణ చెప్పాలని అన్నారు.

## నవరాత్రి ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలి

**ప్రజాపక్షం / జోగిపేట :** వినాయక నవరాత్రి ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని జోగిపేట సిఐ అనిల్ కుమార్ అన్నారు. పండగలను వినోదంగా జరుపుకోవాలని ప్రజలకు ఏలాంటి ఇబ్బందులు కలగకూడదని పండగలు విషాధంగా కాకుండా చూచుకోవాలని మండల పరిధిలోని అన్ని గ్రామా పంచాయతీలో మండపాలు ఏర్పాటు చేసుకొని పోలీసు శాఖకు తెలియజేయాలన్నారు. పోలీసు శాఖ వారు ఏర్పాటు చేసిన యాప్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని తెలిపారు. వినాయక చవితి మొదలు నిమజ్జనం వరకు పూర్తి భాధ్యత నిర్వాహకులే చూచుకోవాలని ,ఏదైన సమస్య వస్తే పోలీసు సహాయం తీసుకోవాలని గత సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా ప్రశాంత వాతావరణంలో పండుగలను జరుపుకోవాలన్నారు. డిజే సౌండ్‌సిస్టమ్ పూర్తిగా నిషేదించామని ఏవరైన ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. తహసీల్దార్ మధుకర్‌రెడ్డి మాట్లాడుతూ గత సంవత్సరం మాదిరిగానే ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని మండల ప్రజలకు సూచించారు.

## ఎ.సి.బి వలలో గోవిందరామ్

**ప్రజాపక్షం/ సంగారెడ్డి :** సంగారెడ్డి జిల్లాలోని ఓ కాలేజీకి కొద్ది రోజుల క్రితమే జిల్లా ఇంటర్మీడియట్ అధికారి అయిన గోవిందరామ్, తనిఖీకి వెళ్లారు. అయితే అక్కడ చిన్న చిన్న పొరపాట్లు ,ఇతర అంశాలను పరిశీలించిన ఆయన వాటిని సరిచేసి కాలేజీకి అనుకూలంగా రిపోర్టు ఇవ్వాలంటే తనకు రూ.50 వేలు లంచంగా ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశాడు. ఈ విషయంలో చేసేది లేక సదరు కాలేజీ యాజమాన్యం ముందుగా గోవిందరామ్‌కు రూ. 30 వేలు లంచం ఇచ్చారు. మిగతా కూడ ఇవ్వాలని ఒత్తిడి చేయగా వారు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. బుదవారం సంగారెడ్డి కలెక్టరేట్ కార్యాలయంలో ఇంటర్మీడియట్ అధికారి గోవింద్ రామ్ తన ఆఫీసులో మిగతారూ. 20 వేల డబ్బులు భాదితుల నుంచి లంచంగా తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కాడు. ఈ దాడుల్లో ఏసీఈ డిఎస్పీ సుదర్శన్ ,ఇన్స్పెక్టర్లు వేంకటేశ్వర్లు ,రమేష్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## నిరుపేదల సొంతింటి కలను సాకారం చేస్తున్న కాంగ్రెస్



**ప్రజాపక్షం/కౌడిపల్లి :** నిరుపేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ ఆవుల రాజిరెడ్డి అన్నారు. కౌడిపల్లి మండల పరిధిలోని వెంకటాపూర్ (ఆర్) గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను బుధవారం నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆవుల రాజిరెడ్డి మాట్లాడుతూ, గత పదేళ్ల పాలనలో మండలంలోని ఒక తండా మినహా ఏ ఒక్క గ్రామంలోనైనా ఇల్లు ఇచ్చిన దాఖలు లేవని. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నర్సాపూర్ నియోజకవర్గంలో ఇప్పటికే మూడు వేలకుపైగా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసినట్లు తెలిపారు. పేదలకు గూడు కల్పించాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. రానున్న రోజుల్లో నియోజకవర్గంలోని ఏ గ్రామంలోనూ నిరుపేదలు గుడిసెల్లో నివసించే పరిస్థితి లేకుండా చేయడమే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లక్ష్యమని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి రెండో విడతలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయించి, నిర్మాణ పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ సున్నం సతీష్, గ్రామ కాంగ్రెస్ శాఖ అధ్యక్షుడు గొల్ల మల్లేష్, గ్రామ సర్పంచ్ లక్ష్మీ కుమార్, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ పాషా, శ్రీకాంత్, వెంకటేష్ గౌడ్, ఇండ్ల లబ్ధిదారులు కార్యకర్తలు నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## దళితుల సంక్షేమాన్ని నిర్లక్షం చేస్తున్న కాంగ్రెస్ సర్కార్



**ప్రజాపక్షం/గజ్వేల్ :** దళితులను అడ్డం పెట్టుకొని కాంగ్రెస్ పార్టీ రాజకీయం చేస్తుందని, కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో దళితులకు ఒరిగిన ప్రయోజనం ఏమీ లేదని గజ్వేల్ మాజీ జెడ్పిటిసి డాక్టర్ మల్లేశం విమర్శించారు. బుధవారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దళితుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ కెసిఆర్ ప్రతి కుటుంబానికి రూ 10 లక్షల ఆర్థిక సహాయం అందించగా, అధికారం చేపట్టిన సీఎం రేవంత్ రెడ్డి ఆ పథకాన్ని రద్దు చేసినట్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా ఏఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే ఇచ్చిన హామీ మేరకు అంబేద్కర్ అభయ హస్తం కింద రూ 12 లక్షలు ప్రతి దళిత, గిరిజన కుటుంబానికి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ప్రభుత్వ కాంట్రాక్టుల్లో 30 శాతం రిజర్వేషన్ కల్పించాలని, అదేవిధంగా ఎస్సీ రిజర్వేషన్ 15 శాతం నుండి 18 శాతంకు పెంచుతామని, ఎస్టీలకు 12 శాతం రిజర్వేషన్ ఇస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. అయితే అవేమీ వర్తింపజేయకుండా కల్లబొల్లి మాటలతో సీఎం రేవంత్ రెడ్డి పబ్బం గడుపుకుంటున్నట్లు విమర్శించారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ పట్ల అనుచితంగా మాట్లాడిన ఎమ్మెల్సీ తాతా మధు విచారం వ్యక్తం చేస్తూ క్షమాపణ చెప్పగా, రాజకీయ లబ్ధి, కాంగ్రెస్ పార్టీ ఉనికి కోసం డప్పుల మోత చేపట్టినట్లు ఆరోపించారు. అన్ని వర్గాల ప్రజలు కేసీఆర్ వైపు చూస్తుండగా, జీర్ణించుకోలేని సీఎం రేవంత్ రెడ్డి డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచిలు, నేతలు రాజు, భగవాన్, బాల కిషన్, బూరుగు మధు, పొన్నాల కుమార్ మోహన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## కొమురవెల్లికి మరిన్ని రైలు సౌకర్యాలు

### రూ.40 కోట్లతో అదనపు ప్లాట్‌ఫామ్
### టెంపుల్ కారిడార్‌తో పుణ్యక్షేత్రాలకు
### మెరుగైన రవాణా సౌకర్యం



**ప్రజాపక్షం/కొమురవెల్లి :** శ్రీ మల్లికార్జున స్వామివారి దర్శనార్థం దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ కమర్షియల్ ఆపరేటింగ్ మేనేజర్ డాక్టర్ పద్మజ (ఐఆర్ఎస్) బుధవారం కొమురవెల్లి క్షేత్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ వర్గాలు ఆమెకు స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాన్ని అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆలయ పర్యవేక్షకులు చంద్రశేఖర్ మాట్లాడుతూ కొమురవెల్లి రైల్వే స్టేషన్‌కు భక్తుల రద్దీకి అనుగుణంగా మరిన్ని రైలు సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. సికింద్రాబాద్ నుంచి ఉదయం 6 గంటలకు బయలుదేరే విధంగా ఒక రైలు, సాయంత్రం 5 గంటలకు మరో రైలు, ఏర్పాటు చేయాలని కోరారు. ముఖ్యంగా బుధవారం స్వామివారి దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తున్నందున ఆ రోజు ప్రత్యేకంగా రైలు నడిపేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ కమర్షియల్ ఆపరేటింగ్ మేనేజర్ డాక్టర్ పద్మజ స్పందిస్తూ కొమురవెల్లి రైల్వే స్టేషన్‌లో రూ.40 కోట్ల వ్యయంతో అదనపు ప్లాట్‌ఫామ్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రైల్వే మౌలిక సదుపాయాలను మరింత అభివృద్ధి చేసి భక్తులకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అలాగే మనోహరాబాద్‌కొత్తపల్లి రైల్వే మార్గం పూర్తయితే టెంపుల్ కారిడార్‌కు మార్గం సుగమం అవుతుందని తెలిపారు. దీంతో నాచారం లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయం, కొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవాలయం, వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవాలయం, కొండగట్టు ఆంజనేయ స్వామి దేవాలయాలను రైల్వే మార్గం ద్వారా అనుసంధానించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

## మాదాసును పరామర్శించిన ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి



**ప్రజాపక్షం/గజ్వేల్ :** మర్కుక్‌లో జరిగిన రైతు ధర్నాలో గాయపడి పోలీసుల నిర్బంధానికి గురైన మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్‌ను బుధవారం డాక్టర్ వంటేరు ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, ఎఫ్డిసి మాజీ చైర్మన్, నియోజకవర్గ బీఆర్ఎస్ ఇంచార్జి వంటేరు ప్రతాప్ రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజమౌళి గుప్త పరామర్శించారు. అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, ఎన్నికల హామీలు, ప్రజా సమస్యలు, బీఆర్ఎస్ శ్రేణులపై జరుగుతున్న అణచివేత వైఖరిపై వారు చర్చించారు. ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష గొంతులను అణచివేయడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని నేతలు హితవు పలికారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుపై ప్రజల్లోకి మరింత బలంగా వెళ్లి, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని అన్నారు. కేసీఆర్ నాయకత్వమే తెలంగాణకు శ్రీ రామ రక్ష అని, గత పదేండ్ల పాలనలో సుభిక్షంగా ఉన్న రాష్ట్రం నేడు సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రం రాక్షస పాలనగా మారిందని విమర్శించారు. అలాగే ఎంపీటీసీల ఫోరమ్ మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్, గజ్వేల్ మండల పార్టీ అధ్యక్షుడు బెందే మధు, మాజీ జడ్పీటీసీ డాక్టర్ మల్లేశం, బీసీ సెల్ మాజీ ఉమ్మడి జిల్లా కార్యదర్శి ఆకుల దేవేందర్, నేతలు శ్రీనివాస్ రెడ్డి, దయాకర్ రెడ్డి, గొడుగు స్వామి, అరిగే అశోక్, రమేష్ గౌడ్ మాతపల్లి సర్పంచ్ మహిపాల్, అహ్మద్, రాయవరం సర్పంచ్ రమేష్ తదితరులు మాదాసును పరామర్శించిన వారిలో ఉన్నారు.

## 21 కోట్ల రూపాయల అండర్ బ్రిడ్జీ మంజూరు

**ప్రజాపక్షం / రాంచంద్రాపురం :** పటాన్‌చెరు నియోజకవర్గం పరిదిలోని తెల్లాపూర్ డివిజన్ పరిధిలో 21 కోట్ల రూపాయల విలువైన రోడ్ అండర్ బ్రిడ్జీ ని మంజూరు చేయించడం జరిగిందని మెదక్ ఎంపి రఘునందన్‌రావు, తెలిపారు. బుదవారం సౌత్ సెంట్రల్ రైల్వే జీఎం సంజయ్ కుమార్ వాత్సవ ని కలిసి ధన్యవాదాలు, తెలిపారు. అనంతరం మెదక్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని రైల్వే సమస్యలు కొత్త ప్రతిపానలపై చర్చించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. మెదక్ పార్లమెంట్ పరిధిలో దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. ఇందులో భాగంగానే తెలాపూర్ బెల్ ప్రాంతంల్లో ప్రజలు డిమాండ్ చేస్తున్న రోడ్ అండర్ బ్రిడ్జ్ (ఆర్,యు,బి) ని మంజూరు చేయించామని త్వరలో పనులు ప్రారంబిస్తామని అన్నారు.

**పుట్ ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణం :** తెల్లాపూర్ రైల్వే స్టేషన్ ఆవరణలో ప్రయాణికులకు ఉన్న అసౌకర్యాన్ని దూరం చేసేందుకు పుట్ ఓవర్ బ్రిడ్జిన్ మంజూరు చేయించామని ఈ నెలాఖరుకు పనులు ప్రారంభిస్తామని తెలిపారు. తెల్లాపూరు బెల్ ప్రాంతంలో ప్రజలు సుదీర్ఘ కాలంగా ఎదుర్కొంటున్న సమస్యలు తీరనున్నాయని తెలిపారు.

**ఎంఎటీఎస్ సేవలు విస్తరించాలి :** లింగంపల్లి వరకు వస్తున్న ప్రతి ఎంఎంటీఎస్ రైల్ ను ఇటు రాంచంద్రాపురం అటు నాగుల పల్లి వరకు పొడగించాలని జీఎం ను కోరినట్లు తెలిపారు. పశ్చి హైదరాబాద్‌లో జనావాసాలు పెద్ద ఎత్తున పెరిగిన నేఫథ్యంలో ట్రాపిక్ నివారణతోపాటు రవాణా సౌకర్యాలు మెరుగుపరిచేందుకు ఎంఎంటీఎస్ విస్తరణ ఏకైక మార్గమని తెలిపారు. అయితే ఈ ప్రతిపాదనలు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన ఉందని జీఎం పేర్కొన్నారు. ఈ దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేసారు.

## పార్టీలో పదవులు రాని వారు నిరాశ చెందొద్దు

**ప్రజాపక్షం / పంగారెడ్డి :** పార్టీలో పదవులు రాని వారు నిరాశ చెందోద్దని ,పదవులు వచ్చిన రాకున్నా నేను అందరిని గుర్తిస్తానని త్వరలోనే మండలాల వారీగా సమావేశాలు ఏర్పాటు చేసి ప్రతి కార్యకర్తతో మాట్లాడుతానని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీల కమిటీల సమావేశంలో పిసిసి వర్కింగ్ ప్రసిడెంట్ జగ్గారెడ్డి వెల్లడించారు. బుదవారం సంగారెడ్డి నియోజికవర్గ కాంగ్రెస్ పార్టీ నియామక సమావేశం సంగారెడ్డి పట్టణంలోని క్లాసిక్ గార్డెన్‌లో జరిగింది. ఈ సమావేశానికి పిసిసి వర్కింగ్ ప్రసిడెంట్ జగ్గారెడ్డి, డిసిసి అధ్యక్షురాలు నిర్మల జగ్గారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన నియోజకవర్గంలోని నాలుగు మండలాలు , రెండు మున్సిపాల్టీల పార్టీ కీలక నియామక సమావేశంలో జగ్గారెడ్డి పాల్గొన్నారు. అలాగే ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, మహిళా, ఐఎన్‌టీయుసీ, కాంగ్రెస్ కిసాన్ సెల్‌తో పాటు ఇతర ఆర్గనైజేషన్ కమిటీలను సహితం ప్రకటించారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ పార్టీకి పదవులు వచ్చిన వారు రాని వారు అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరిని గుర్తించి కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

**అధికారులతో సమీక్ష సమావేశాలు :**

సంగారెడ్డి నియోజకవర్గ అభివృద్ధి ప్రజా సమస్యల పరిష్కారంపై త్వరలో వరుస సమీక్ష సమావేశాలు నిర్వహించనున్నట్లు జగ్గారెడ్డి తెలిపారు. నాలు మండలాలకు చెందిన గెలిచిన ఓడిన కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు ,నాయకులతో అధికారుల సమక్షంలో ప్రత్యేక రివ్యూ సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. సెప్టెంబర్ 30 నుంచి నాలుగు రోజుల పాటు వరుసగా సమావేశాలు నిర్వహించి ప్రతి ఒక్కరితో వన్ టు, వన్‌గా మాట్లాడతానని చెప్పారు. ఈ సమావేశాలకు పోలీసు శాఖతో పాటు అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతను కూడా పిలిచి ప్రజా సమస్యలు నియోజకవర్గ అభివృద్ధి అంశాలపై చర్చిస్తామని జగ్గారెడ్డి వెల్లడించారు.

## ఉపసర్పంచ్‌ల చెక్‌పవర్ రద్దుచేయాలని కలెక్టర్‌కు వినతి

**ప్రజాపక్షం/శివ్వంపేట :** ఉపసర్పంచ్‌లకు చెక్‌పవర్ రద్దుచేయాలని కోరుతూ మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు బుర్ర మురళీ గౌడ్ ఆధ్వర్యంలో పలువురు సర్పంచ్‌లు కలెక్టర్ ప్రతిమాసింగ్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లోని సర్పంచ్‌లు స్థానిక సమస్యల పరిష్కారానికి పారిశుద్ధ్యం తాగునీరు వంటి అత్యవసర పనులకు విధులు ఖర్చు చేసే సమయంలో చెక్‌పవర్ విషయంలో ఎదురవుతున్న సాంకేతిక రాజకీయ ఇబ్బందుల వల్ల అభివృద్ధి పనులు కుంటుపడుతున్నాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి అయ్యగారి యాదగిరి, కార్యదర్శిలు లక్ష్మి దుర్గయ్యానాయక్, నీరుడి మౌనికమురళీకృష్ణ, కెతావత్ నరేష్, నాయిని సుమలతవేణుగోపాల్‌రెడ్డి, అరుణరెడ్డి, రావెల్లి సాయిలు, లక్ష్మి గేమ్సింగ్, విజయ్‌నాయక్, పుష్ప తదితరులు ఉన్నారు.

# కాళోజీ జీవితం తెలంగాణకు స్ఫూర్తిదాయకం



**ప్రజాపక్షం/నర్సంపేట :** తెలంగాణ రాష్ట్ర భాషా సంస్కృతికి పట్టం కట్టిన మహనీయుడు ప్రజా కవి పద్మభూషణ్ అని మున్సిపల్ చైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మీ రామానంద్ అన్నారు. ప్రముఖ ప్రజా కవి కాళోజి నారాయణ రావు జయంతిని పురస్కరించుకుని నర్సంపేట మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కాళోజి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కాటం భాస్కర్, మున్సిపల్ ఏఈ చంద్రమౌళి, కౌన్సిలర్లు మాదాసి రవి, ఏపూరి శ్రీనివాస్ రెడ్డి, పున్నం నర్సింహారెడ్డి, నలావుద్దీన్ అయూబ్ ఖాన్, మున్సిపల్ అధికారులు, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** ప్రజాకవి కాళోజి నారాయణ రావు జయంతిని పురస్కరించుకొని తెలంగాణ భాషా దినోత్సవం సందర్భంగా బుధవారం గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో కాళోజి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అదనపు కమిషనర్ ఈసంపల్లి జోనా కాళోజి నారాయణరావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో అదనపు కమిషనర్ మాట్లాడుతూ కాళోజీ నారాయణరావు తెలంగాణ సమాజానికి, సాహిత్య రంగానికి అందించిన సేవలు చిరస్మరణీయని కొనియాడారు. సామాజిక స్పృహ, మానవీయ విలువలు, ప్రజాస్వామ్య భావాలను తన సాహిత్యం ద్వారా చాటిన కాళోజీ నేటి తరానికి స్ఫూర్తిదాయకుడని పేర్కొన్నా రు. కార్యక్రమంలో సిఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, డిఎఫ్ఓ శంకర్‌లింగం, అకౌంట్స్ అధికారి శివలింగం, సిహెచ్ఓ లక్ష్మారెడ్డి, ఎస్ఇ రాజ్‌కుమార్, డిప్యూటీ కమిషనర్లు ప్రసన్నరాణి, సమ్మయ్య, ఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, హెచ్ఓ ప్రశాంత్, సంతోష్‌బాబు, రవి కుమార్, సంజయ్‌కుమార్, అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/మహబూబాబాద్:** కాళోజీ జీవితం తెలంగాణకు స్ఫూర్తిదాయకమని మహబూబాబాద్ డిఎస్‌పి ఎన్ తిరుపతిరావు అన్నారు. కాళోజీ నారాయణ రావు జయంతి వేడుకలను బుధవారం స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో కాళోజీ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వాకర్ అసోసియేషన్ అధ్యక్షులు నామిరెడ్డి వెంకటరెడ్డి అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ డీఎస్పీ యన్. తిరుపతి రావు ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. సమావేశంలో వాకర్ అసోసియేషన్ గౌరవ సలహాదారులు మైస నాగయ్య, మైస శ్రీనివాస్, కార్యదర్శి పట్టాభి లక్ష్మయ్య, కోశాధికారి సోమ విష్ణువర్ధన్, పెద్ది వెంకన్న, జిలకర శ్రీహరి, నేతుల వెంకన్న,బి రాజు, జగదీష్, వీరేందర్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, ఉపేందర్, మల్లారెడ్డి, వేముల రవీందర్, ఎస్ శ్రీనివాస్ రెడ్డి, ప్రభాకర్, నరేష్ రెడ్డి, మహేందర్ రెడ్డి, తోలెం వెంకటేశ్వర్లు, కమలాకర్, రాజన్న, రాంబాబు, మేడ వెంకటేశ్వర్లు, పగడయ్య, నల్లు దేవేందర్ రెడ్డి, దామోదర్, మధుకర్, విద్యాసాగర్,మల్లయ్య, లక్ష్మీ నారాయణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** తెలంగాణ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రజాకవి కాళోజి నారాయణ రావు జయంతి వేడుకలను ప్రభుత్వ వృత్తి విద్య జూనియర్ కళాశాల, హనుమకొండలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి ఏ.గోపాల్ కాళోజి నారాయణరావు చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ ఎస్. శ్రీధర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణ భాష, సంస్కృతి, సామాజిక చైతన్యం కోసం కాళోజి నారాయణరావు చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు.కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ రేణుకుంట్ల ప్రవీణ్ కుమార్, డాక్టర్ సవ్వాసి శ్రీనివాస్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.






**ప్రజాపక్షం/కమలాపూర్:** కాళోజీ చేసినటువంటి సేవలు ప్రజలు ఏనాడు మరిచిపోలేదని మండల అభివృద్ధి అధికారి గుండె బాబు అన్నారు. మండల పరిషత్ అభివృద్ధి ఆధ్వర్యంలో కాళోజీ నారాయణ రావు జయంతి వేడుకలు మండల అధికారులు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రానికి ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకుంటున్నారు. అలాంటి వ్యక్తిని ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతి అధికారి చేతన్ కుమార్ రెడ్డి, మండల కార్యాలయ పర్యవేక్షకులు కరణ్ సింగ్, ఏపివో రమేష్ తోపాటు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** స్థానిక భూపాలపల్లి ఎస్ఆర్ డిజి పాఠశాలలో తెలంగాణ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రిన్సిపాల్ గద్దం కృష్ణ చైతన్య ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కాళోజీ నారాయణ రావు జయంతి రోజు తెలంగాణ భాష దినోత్సవం అధికారికంగా నిర్వహించుకోవడం జరుగుతుందని మన తెలంగాణ ప్రాంతానికి ఒక ప్రత్యేకమైన మాండలికం యాస ఉందని మన ప్రాంత యాసలోనే మన సంస్కృతి ఉందని మన ముందు తరాలకు అందించాల్సినటువంటి బాధ్యత మనందరిపై ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/పాలకుర్తి:** మండ కేంద్రంలోని సిద్ధార్థ పాఠశాలలో తెలంగాణ బాషా దినోత్సవాన్ని (కాళోజీ నారాయణ రావు జయంతి) పురస్కరించుకుని విద్యార్థులు, ఉపాధ్యాయులు అత్యంత వైభవంగా వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల హెచ్ఎం జక్కుల రవీందర్ కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కరెస్పాండెంట్ ఊర్మిల, దామోదర్, సొమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/సంగారెడ్డి :** తెలంగాణ ప్రజాకవి పద్మవిభూషణ్ డాక్టర్ కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకొని జిల్లా పోలీసు కార్యాలయంలో కాళోజీ చిత్రపటానికి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ పరితోష్ మాట్లాడుతూ కాళోజీ నారాయణరావు తెలుగు సాహిత్యానికి తెలంగాణ ఉద్యమానికి అక్షర యోధుడిగా నిలిచారని అన్నారు. తన కవితాభావాలను తెలంగాణ యాసలో సామాన్య ప్రజలకు సైతం సులభంగా అర్థమయ్యే రీతిలో వ్యక్తీకరించారని తెలిపారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ అధికారి పద్మావతి ,ఎఆర్‌డిఎస్పీ నరేందర్, డిసి ఆర్‌బి ఇన్‌స్పెక్టర్ రమేష్, ఎస్పీ ఇన్‌స్పెక్టర్ రమేష్, ఇన్‌స్పెక్టర్ సదానాగరాజు, ఆర్ఐలు సురేష్ నాయక్, రాజశేఖర్ ,డానియల్ ఇతర కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




**ప్రజాపక్షం/సంగారెడ్డి :** ప్రజా కవి కాళోజీ నారాయణ రావు జీవితం ఆయన సాహిత్య స్ఫూర్తి ప్రజా సమస్యలపై ఆయన చేసిన పోరాటం నేటి తరానికి ఆదర్శప్రాయమని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. కాళోజీ నారాయణ రావు, జయంతిని పురస్కరించుకొని బుధవారం సంగారెడ్డి కలెక్టరేట్‌సమావేశ మందిరంలో అధికారికంగా నిర్వహించిన జయంతి వేడుకల్లో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అదనపు కలెక్టర్ పాండు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కాళోజీ నారాయణరావు చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ కాళోజీ నారాయణరావు తన రచనల ద్వారా ప్రజల సమస్యలు ,ఇబ్బందులను ఏప్పటికప్పుడు సమాజం ముందుకు తీసుకువచ్చి ప్రజల్లో సామాజిక రాజకీయ చైతన్యాన్ని నింపారని అన్నారు. ప్రజల పక్షాన నిలబడి సామాన్యుల గొంతుకగా తన సాహిత్యాన్ని మలిచిన కాళోజీ ప్రజా కవిగా చిరస్థాయిగా నిలిచిపోయారని పేర్కొన్నారు.సమాజంలోని అసమానతలు, ప్రజల సమస్యలు ,సామాజిక పరిస్థితులపై తనదైన శైలిలో స్పందిస్తూ ప్రజలను చైతన్య పరిచిన మహనీయుడు కాళోజీ అని కొనియాడారు. ఆయన సాహిత్యం నేటికి ప్రజల్లో చైతన్యాన్ని కలిగిస్తోందని కాళోజీ ఆశయాలకు ముందుగా తీసుకెళ్లడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారి జగదీష్, డీపీఆర్వో విజయలక్ష్మి , కలెక్టరేట్ ఏఓ విజయలక్ష్మి ,వివిధ శాఖల అధికారులు ,ఉద్యోగులు ,కలెక్టర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/వెల్దుర్తి:** తెలంగాణ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెల్దుర్తి పాఠశాలలో బుధవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ భాష, యాస, సాహిత్యం, సంస్కృతి గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు. ప్రముఖ తెలంగాణ కవి, ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకుని ఆయన సాహిత్య సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీ, పద్య పఠన పోటీలు, సోధి నిర్వహించారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పోటీలలో పాల్గొన్నారు. పోటీలలో ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందించారు. తెలంగాణ భాషను, సంస్కృతిని, సాహిత్య సంపదను పరిరక్షించి భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాంబయ్య తెలిపారు. ఇటువంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో తెలుగు భాషపై ఆసక్తి, సృజనాత్మకత, వేదికపై మాట్లాడే నైపుణ్యాలు పెంపొందుతాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించిన తెలుగు భాషా ఉపాధ్యాయులైన అర్చన, విజయ మోహన్ రాజ్, ఖాదీర్ పాషా ఉపాధ్యాయులను అభినందించి సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వి.వెంకట స్వామి, ఎస్. శ్రీనివాసరావు, ఎస్.నర్సింహా రెడ్డి, చార్లెస్, వెంకట్ రెడ్డి, అమూల్య, జయసుధ,శైలజ, నవనీత తదితర ఉపాధ్యాయులు పాల్గొనడం జరిగింది. అదే విధంగా రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన సాంబయ్య ప్రధానోపాధ్యాయులు గారిని పాఠశాల సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు ఘనంగా సత్కరించారు.



**ప్రజాపక్షం/పాపన్నపేట:** ప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకుని తెలంగాణ భాషా దినోత్సవం వేడుకలను బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పొడిచన్ పల్లి లో జరిగిన ఈ కార్యక్రమం లో ముందుగా కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు మాధవ రెడ్డి మాట్లాడుతూ, అన్యభాషల నేర్చి ఆంధ్రంబు రాదనుచు సకిలించు ఆంధ్రుడా అని తెలుగు వారిని చైతన్యపరిచిన మహనీయుడు కాళోజీ అని కొనియాడారు. తెలంగాణ యాస, భాషల గొప్పతనాన్ని, సంస్కృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత నేటి విద్యార్థులపైనే ఉందన్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, పైన అవగాహన కల్పించారు. కాళోజీ కవితలు ఆలపించారు. ఈ వేడుకల్లో పాఠశాల ఉపాధ్యాయులు జి.శ్రీనివాస్ గౌడ్, కె.కిషన్, కె.శివశంకర్, పిడి కె.మహిపాల్, కంప్యూటర్ ఆపరేటర్ పాషా, విద్యార్థులు పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/కొండపాక :** తెలంగాణ ప్రజాకవి, పద్మవిభూషణ్ శ్రీ కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకొని తెలంగాణ భాషా దినోత్సవ వేడుకలను కొండపాక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల లో బుధవారం ఘనంగా నిర్వహించారు. కాళోజీ చూపిన మార్గంలో నడుస్తూ తెలంగాణ భాష, సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/చేర్యాల/మద్దూరు :** కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకుని, సిద్దిపేట జిల్లా ధూళిమిట్ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మరియు చేర్యాల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో వేరువేరుగా తెలుగు శాఖ ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ధూళిమిట్ట మండల ఎంఇఒ మరియు ధూళిమిట్ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనుముల కర్ణాకర్ రెడ్డి, చేర్యాల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ పోలోజు నర్సింహాచారి మాట్లాడుతూ, తెలుగు భాష వైభవాన్ని ప్రపంచానికి చాటేందుకు ప్రతి ఒక్క విద్యార్థి కృషిచేయాలని అన్నారు. తెలంగాణ మాండలికం, జాతీయాలను, సామెతల విశిష్టతను వివరిస్తూ, భాషావికాసంతోనే సంస్కృతిక వికాసం ముడిపడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఇరు పాఠశాలల అధ్యాపకులు, వైస్ ప్రిన్సిపాళ్లు, విద్యార్థులు పాల్గొన్నారు.